నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 20-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 124 | పేజీలు: 4 | వెల: రూ.1/-

మసీదుగడ్డ జంగిల్‌క్యాంప్ ప్రారంభం

హైదరాబాద్, డిసెంబర్19: నగరంలోని పెద్ద గోల్కొండ సమీపంలో మసీదుగడ్డ జంగిల్‌క్యాంప్(అర్బన్ ఫారెస్ట్ పార్క్)ను రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి నేడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు అజయ్ మిశ్రా, రాజేశ్వర్ తివారీ, పీసీసీఎఫ్ ఆర్.శోభ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ పార్క్‌లో సాహసక్రీడల కోసం అడ్వెంచర్ జోన్, రాత్రి పూట నివాసముండేలా జంగిల్ క్యాంప్, సైక్లింగ్, ట్రెకింగ్ వంటి సదుపాయాలను కల్పించారు. రక్షణ కోసం పార్క్ చుట్టూ చైన్ లింక్డ్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు.

రహదారి పనులను వేగవంతం చేయండి

– నాణ్యత విషయంలో రాజీపడొద్దు

– మేడారం రహదారి పనులను పరిశీలించిన మంత్రి సత్యవతి రాథోడ్

మేడారం జాతరను పురస్కరించుకుని చేపట్టిన రోడ్డుపనులను పరిశీలించిన మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, డిసెంబర్19(నేటినిజం ప్రతినిధి) : రహదారి నిర్మాణం పనులను వేగవంతం చేయాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడొద్దని స్త్రీ–శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మేడారం జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న జాతీయ రహదారుల పనులను మంత్రి గురువారం పరిశీలించారు. మహబూబాబాద్‌లోని కంబాలపల్లి నుంచి నర్సంపేట వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ వెంటనే పనులను పూర్తి చేసి రోడ్డు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. వెంటనే సిబ్బందిని, యంత్రాలను పెంచాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని.. పనుల నాణ్యతలో లోపాలు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు వేయడంతో పాటు దాని నిర్వహణ కూడా ఎప్పటికప్పుడూ చేసేలా సంబంధిత ఏజెన్సీ, అధికారులు అందుబాటులో ఉండాలని మంత్రి పేర్కొన్నారు. నాణ్యతలో లోపాలు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని అధికారులను మంత్రి సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. ఇదిలావుంటే టీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మానుకోట పట్టణం అభివృద్ధి దిశగా పయనిస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పట్టణాలు, పల్లెల్లో అభివృద్ధి కోసం పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలను ఏర్పాటు చేసి తెలంగాణ పట్టణాలపై ప్రత్యేక దృష్టిపెట్టి అభివృద్ధి చేస్తున్నామ న్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, పట్టణంలో అభివృద్ధి పనుల కొరకు అడగగానే నిధులు మంజూరు చేశారన్నారు. రూ. 50 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. పూర్తన వెంటనే మరో రూ. 50 కోట్లు తీసుకొచ్చి పట్టణాన్ని సుందరీకరిస్తామన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మున్సిపాలిటీలకు నిధులు సమకూరుతున్నాయని, పట్టణంలోని శివారు కాలనీల్లో కూడా సైడ్‌డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు.

తెలంగాణలో పెరిగిన పంట ఉత్పత్తులు

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పంట దిగుబడులు పెరిగాయి. మార్కెట్లకు వస్తున్న ధాన్యం లెక్కలే దీనిని రూపిస్తున్నాయి. రాష్ట్రం ఏర్పడక ముందు 4 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ చేసే గోడౌన్లు మాత్రమే ఉండేవి. సీఎం కేసీఆర్ ఆదేశాలతో 1024 కోట్లతో కొత్త గోడౌన్ల నిర్మాణం చేపట్టారు. అలాగే రాష్ట్రంలో రూ.వెయ్యి కోట్ల నాబార్డు నిధులతో 330 ప్రాంతాల్లో గోదాములు నిర్మిస్తున్నట్లు గతంలోనే మంత్రి హరీశ్‌రావు తెలిపారు. అన్ని జిల్లాల్లో రైతులు కోరిన విధంగా గోడౌన్లు నిర్మించనున్నారు. నల్లగొండ జిల్లాల్లో బత్తాయి నిల్వల కోసం గోడౌన్ నిర్మించేందుకు పరిశీలిస్తున్నారు.

ఆగని పౌర ఆందోళనలు

ఢిల్లీ, యూపి, కర్నాటకలో 144 సెక్షన్

న్యూఢిల్లీ,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): జాతీయ పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు చేపడుతున్న నిరసనలు హింసాత్మకంగా మారుతుండడంతో గురువారం దేశ రాజధాని ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ తోపాటు పలు రాష్ట్రాల్లో సెక్షన్ 144ను విధించారు. నిరసనల నేపథ్యంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ఇక, కర్నాటకలోని పలు ప్రాంతాల్లోనూ మూడు రోజులపాటు సెక్షన్ 144ను విధించారు. అయితే, నిషేధం ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఆందోళనకారులు భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు సమాచారం. దీంతో ఢిల్లీలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు రవాణా ఆంక్షలు విధించడంతో ఢిల్లీలో భారీగా ట్రాఫిక్ జామ్నైంది. జామియా మిలియా ఇస్లామియా, జసోలా విహార్ షాహీన్ భాగ్, మునిర్‌కా, లాల్ క్విలా, జామా మసీద్, చాందినీ చౌక్ విశ్వవిద్యాలయ స్టేషన్లను మూసివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఆందోళనల దృష్ట్యా దిల్లీ వ్యాప్తంగా 17 మెట్రో స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను మూసివేశారు. ఆయా స్టేషన్లో మెట్రో రైళ్లు ఆగవని అధికారులు వెల్లడించారు. అయితే ఇంటర్‌ఛేంజ్ సదుపాయం మాత్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా ఆందోళనల కోసం పక్క రాష్ట్రాల నుంచి ప్రజలను దిల్లీకి తీసుకొస్తున్నట్లు సమాచారం రావడంతో కేంద్ర హోం శాఖ అప్రమత్తమైంది. దిల్లీ సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. దిల్లీ–గురుగ్రామ్ హైవేపై పోలీసులు తనిఖీలు చేపట్టడంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు భారీగా స్తంభించి పోయింది. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆందోళనల నేపథ్యంలో ఎర్రకోట, మండి హౌజ్ ప్రాంతంలో 144 సెక్షన్ విధించారు.

ఆగని సవరణ సెగలు!

– రణరంగంగా మారిన ఎర్రకోట పరిసర ప్రాంతాలు

– వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు

– అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత

– హైదరాబాద్‌లోనూ కొనసాగిన ఆందోళనలు

న్యూఢిల్లీ, డిసెంబర్19(ఆర్ఎన్ఎ) : పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలతో దేశ వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలు రాష్ట్రాల్లో ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. గురువారం రాజధానిలోని చారిత్రక కట్టడం ఎర్రకోట రణరంగంగా మారింది. సీఏఏకు నిరసనగా వామపక్షాల నేతృత్వంలోని ఆందోళనకారులు ఎర్రకోట వద్ద భారీ కవాతుకు పిలుపునివ్వడంతో ఉద్రిక్తంగా మారింది. కవాతుకు పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ గురువారం ఉదయం వేలాది మంది నిరసనకారులు ఎర్రకోట వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు, ఆందోళన కారుల మధ్య తోపులాట చోటు చేసుకోవటంతో పరిస్థితి చేదాటింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆందోళన కారులను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలాఉంటే మరోవైపు ఆందోళనల దృష్ట్యా ఢిల్లీ వ్యాప్తంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. నగరానికి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. దీంతో ఢిల్లీ – గురుగ్రామ్ సరిహద్దులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ దారిలో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. అటు ముందు జాగ్రత్త చర్యగా ఢిల్లీలోని 13 మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేశారు. ఆయా స్టేషన్లలో మెట్రో రైళ్లు ఆగవని ప్రకటించారు. గత పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఎర్రకోట వద్ద లాఠీఛార్జిని నిషేధించారు. మరోవైపు పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కర్ణాటకలోనూ ఆందోళనలు చేపట్టారు. 144 సెక్షన్ విధించినప్పటికీ కలబుర్గీ ప్రాంతంలో నల్ల జెండాలు చేతబట్టి నిరసనకారులు ఆందోళన చేశారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరులో ఆందోళనలో పాల్గొన్న ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

హైదరాబాద్‌లోనూ ఆందోళనలు..

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు నిరసన ర్యాలీకి వామపక్షాలు పిలుపునిచ్చాయి. దీంతో నాంపల్లి వద్ద భారీగా మోహరించిన పోలీసులు అక్కడికి వచ్చిన వారిని అరెస్టు చేశారు. మాజీ ఎంపీ, సీపీఐ నేత అజిత్ పాషా సహా, పలువురు విద్యార్థి, యువజన సంఘాల నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్న పౌరసత్వ చట్టాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మరోవైపు ర్యాలీకి బయల్దేరిన హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 50 మంది విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు.

హజీపూర్ హత్యకేసులో..

ఫాస్ట్ ట్రాక్ కోర్టు విచారణ పూర్తి

– రెండు నెలల పాటు సాగిన విచారణ

– 300మంది సాక్షుల వాంగ్మూలాలు రికార్డు

– ఈ నెలాఖరులో శిక్ష విధించే అవకాశం

– ఉరితీయాలంటూ డిమాండ్ చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

హైదరాబాద్, డిసెంబర్19(ఆర్ఎన్ఎ) : హజీపూర్ హత్యల కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు విచారణ గురువారం మఉగిసింది. ఫోరెన్సిక్ రిపోర్టును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు పోలీసులు అందచేశారు. సెల్ టవర్ లోకేషన్, కీలక సాక్ష్యాలను అందచేశారు. మొత్తం రెండు నెలల పాటు ఫాస్ట్ ట్రాక్ కోర్టు విచారణ చేపట్టింది. 300 మంది సాక్షులను వాంగ్మూలాలను రికార్&ఢ చేశారు. విచారణ ముగియడంతో తీర్పుపై ఉత్కంఠ నెలకొంది. డిసెంబర్ నెలాఖరులో తీర్పు వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే హత్యకేసులో మృతుల కుటుంబాల సభ్యులు నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని ఉరితీయాలని, ఎన్‌కౌంటర్ చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరులో శిక్షణు విధించనుండటంతో ఎలాంటి శిక్ష పడుతుందోనని అందరిలో ఆసక్తి నెలకొంది. శ్రీనివాస్‌రెడ్డి ఎన్‌కౌంటర్ చేస్తేనే మృతులకు ఆత్మశాంతి చేకూరుతుందని మృతుల కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 25న హాజీపూర్ గ్రామంలో విద్యార్థిని శ్రావణి అదృశ్యమవ్వటంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు లేకపోవటంతో ఆచూకీ దొరలేదు. శ్రావణి పాఠశాలకు వెళ్లి విచారించిన పోలీసులు బొమ్మలరామారం వెళ్లినట్లు గుర్తించారు. ఏప్రిల్ 26న సీసీటీవీ ఫుటేజ్‌తో దర్యాప్తు ప్రారంభించారు. కీసర – బొమ్మలరా ం మార్గంలో గాలింపు చేశారు. అదేరోజు పాడుబడిన బావి పక్కన శ్రావణి స్కూల్ బ్యాగ్ గుర్తించారు. పక్కనే ఉన్న బావిలో వెతికి చూడగా మృతదేహాన్ని గుర్తించారు. శ్రీనివాసరెడ్డికి చెందిన బావిగా గుర్తించిన పోలీసులు.. ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసులు విచారించగా శ్రావణిపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు శ్రీనివాస్ రెడ్డి ఒప్పుకున్నారు. అదేవిధంగా శ్రీనివాస్‌రెడ్డి విచారణలో నిర్ఘంతపోయే విషయాలు బయటకొచ్చాయి. 2015లో మైసిరెడ్డి పల్లికి చెందిన కల్పన, మరో బాలిక మనీషాను కూడా హత్యాచారం చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి ఒప్పుకున్నాడు. హత్య ఘటనలపై యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు వరంగల్ సెంట్రల్ జైలులో విచారణ ఖైదీగా ఉ న్న శ్రీనివాస్‌రెడ్డిపై బుధవారం నాటికి దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. అక్కడే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి శ్రీనివాస్‌రెడ్డిని విచారించారు. రెండు నెలల పాటు విచారించగా గురువారం విచారణ పూర్తయింది. కాగా ఈనెలాఖరున శ్రీనివాస్‌రెడ్డికి శిక్షవిదించే అవకాశాలు ఉన్నాయి.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ జైళ్ల సంస్కరణలు

– ప్రిజనర్స్ స్పోర్ట్స్ మీట్‌లో డీజీపీ మహేందర్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్19(ఆంఎన్ఎ) : దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ జైళ్ల శాఖ పనిచేస్తోందని డీజీపీ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ చంచల్‌గూడ జైల్లో గురువారం జరిగిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి డీజీపీ మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ప్రిసనర్స్ స్పోర్ట్స్‌మీట్‌ను డీజీపీ, జైళ్లశాఖ డీజీ రాజీవ్‌త్రివేది ప్రారంభించారు. అనంతరం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ జైళ్ల సంస్కరణలు దేశానికే స్ఫూర్తి అని ప్రశంసించారు. పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను తీర్చిదిద్దడంలో రాజీవ్ త్రివేది పాత్ర మరువలేనిదన్నారు. రాజీవ్ త్రివేది ఆధ్వర్యంలో జైళ్లశాఖ మరింత మెరుగవుతుందని పేర్కొన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగానే స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించామని డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను తీర్చిదిద్దడంలో జైళ్ల శాఖ డీజీ రాజీవ్ త్రివేది పాత్ర మరవలేనిదని డీజీపీ కొనియాడారు. ప్రతి వ్యక్తి శారీరకంగా దృఢంగా ఉండాలంటే క్రీడలు చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. క్రీడల్లో రాణించాలంటే పట్టుదల, కృషి చాలా ముఖ్యమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. జైళ్లశాఖ సిబ్బంది పోలీస్ శాఖకు ఆదర్శంగా ఉండాలని ఆయన సూచించారు. సమాజ సేవకు జైళ్ల శాఖ చేస్తున్న కార్యక్రమాలు మరవలేనివని ఆయన అన్నారు. అనంతరం జైళ్లశాఖ డీజీ రాజీవ్ త్రివేది మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ జైళ్ల శాఖ పని చేస్తుందని అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖను ఉన్నతమైనదిగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. క్రీడా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ రాణించాలని ఆయన ఆటగాళ్లను కోరారు. క్రీడాకారులకు ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్రీడల్లో 193 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారని, రెండు రోజుల పాటు క్రీడా పోటీలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, వరంగల్, చర్లపల్లి, సెంట్రల్ హైదరాబాద్ రెంజ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ పార్కులతో స్వచ్ఛ వాతావరణం

మసీదుగడ్డ అర్బన్ పార్కును ప్రారంభించిన మంత్రులు

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): నగరంలోని పెద్ద గోల్కొండ సమీపంలో మసీదుగడ్డ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి గురువారం ప్రారంభించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. అర్బన్ పార్కులను పెంచడం ద్వారా పట్టణాల్లో కాలుష్యాన్ని అరికడుతున్నామని అన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటి అటవీకరణకు చర్యలు తీసుకున్నామని అన్నారు. పట్టణాల్లో పరిశుద్ధ వాతావరణం కోసంపార్కుల సంఖ్యను పెంచుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు అజయ్ మిశ్రా, రాజేశ్వర్ తివారీ, పీసీసీఎఫ్ ఆర్. శోభ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

టీచర్‌ను కత్తితో పొడిచి హత్య

రంగారెడ్డి,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రోషన్ కాలనీలో విషాద సంఘటన చోటుచేసుకుంది.

గడిచిన రాత్రి అజర్ అనే వ్యక్తి సోయల్ అనే టీచర్ ఇంటి పక్కన మద్యం సేవిస్తూ అల్లరి చేష్టలకు పాల్పడ్డాడు. దీంతో ఉపాధ్యాయుడు అజర్‌ను మందలించాడు. మద్యం మత్తులో ఉన్న అజర్ కత్తితో ఒక్కసారిగా టీచర్ ఇంట్లోకి ప్రవేశించి దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఉపాధ్యాయుడు సోయల్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లుగా వైద్యులు వెల్లడించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జలపాతంలో పడి..

ముగ్గురు తెలంగాణ విద్యార్థులు మృతి

– త్రయంబకేశ్వర్‌లో విషాద ఘటన

మహారాష్ట్ర, డిసెంబర్19(ఆర్ఎన్ఎ) : విహారయాత్రకు వెళ్లిన విద్యార్థులకు విషాదం మిగిలింది. ఔరంగాబాద్‌లోని ఛత్రపతి షాహు మహారాజ్ వ్యవసాయ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు త్రయంబకేశ్వర్‌కు విహారయాత్ర కోసం వెళ్లగా.. అందులో ముగ్గురు విద్యార్థులు జలపాతంలో మునిగి చనిపోయారు. త్రయంబకేశ్వర్‌కు వెళ్లిన ఆరుగురిలో ముగ్గురు విద్యార్థులు కోటిరెడ్డి, అనూషా, రఘువన్నిలు దుగర్వాడి జలపాతంపైకి ఎక్కాలని నిర్ణయించుకున్నారు. మిగతా ముగ్గురు తాము బస చేసిన హోటల్‌కి తిరిగి వెళ్లారు. కాగా ముగ్గురు విద్యార్థులు గల్లంతు కావటంతో గ్రామస్తుల సహకారంతో ఇద్దరు మృతదేహాలను గుర్తించారు. మరో మృతదేహం కోసం వెతుకులాట ప్రారంభించారు. ఈ ఘటన గురించి త్రయంబకేశ్వర్ తహసీల్దార్ దీపక్ గిరాసే మాట్లాడుతూ.. ఈ జలపాతాన్ని కోటి రెడ్డి ఇంతకుముందు రెండుసార్లు సందర్శించాడని, తన ఇద్దరు మిత్రులను సురక్షితంగా తిరిగి హోటల్‌కు తీసుకువెళ్తానని హామీ ఇవ్వడంతో.. ముగ్గరూ కలిసి జలపాతంపైకి బయలుదేరారన్నారు. అయితే జలపాతం దగ్గరికి వెళ్లిన ఈ ముగ్గురూ సాయంత్రం వరకు హోటల్‌కు తిరిగి వెళ్లలేదు. దాంతో వారి స్నేహితులు.. మొదట ఫోన్‌లో వారిని సంప్రదించడానికి ప్రయత్నించారు, కానీ వారి ఫోన్లు ఏవీ కూడా అందుబాటులో లేనట్లు వచ్చింది. వెంటనే విద్యార్థులు జలపాతం దగ్గరికి వెళ్లిన తమ స్నేహితులను వెతుక్కుంటూ సమీప గ్రామానికి వెళ్లారు, కానీ అక్కడ వారికి ఎటువంటి ఆధారాలు లభించలేదు. దాంతో చేసేది ఏమీ లేక వారంతా తిరిగి హోటల్‌కి చేరుకున్నారు. మరుసటి రోజు ఉదయం ముగ్గురు విద్యార్థులు గ్రామస్థులను తీసుకొని జలపాతం వద్దకు వెళ్లారు. జలపాతంలో నీరు లేనప్పటికీ, జలపాతం అడుగున ఉన్న లోతైన కొలను ఉంది. అక్కడ అనూషా విరిగిన చెప్పులను గ్రామస్థులు చూశారు. వెంటనే కొలనులోకి దిగి వెతకగా.. అనూష మృతదేహం లభించింది. విద్యార్థుల ఫిర్యాదుతో.. అక్కడికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో కోటి రెడ్డి, రఘువన్ని మృతదేహాలను కూడా కొలను నుంచి స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తుమని తెలిపారు.

మహిళలందరికీ వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరాం: హరీశ్‌రావు

సిద్ధిపేట, డిసెంబర్ 19: మంత్రి హరీశ్‌రావు జిల్లాలోని బెజ్జంకి మండలంలో పర్యటిస్తున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా జీఎస్టీ సమావేశానికి సంబంధించిన వివరాలను మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నిన్న ఢిల్లీలో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశంలో ఆర్థిక మాంద్యం, ఆర్థిక క్రమశిక్షణపైనే చర్చ జరిగింది. వడ్డీలేని రుణాలు దేశంలో కొన్ని జిల్లాలకే ఇస్తున్నారు.

అన్ని జిల్లాలకు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాను. దేశంలోని అన్ని సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు ఇవ్వాలని కోరాను. దేశ మహిళలు అందరూ ఆర్థిక స్వావలంబన సాధిస్తారని చెప్పా. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు ఇచ్చే మొత్తాన్ని రూ. మూడు లక్షల నుంచి రూ. ఐదు లక్షలకు పెంచాలని కోరాను. అన్ని రాష్ట్రాల మంత్రులు కలిసి ప్రతిపాధించాలని నిర్మలాసీతారామన్ సూచించారు.

చరిత్రలో నేటినిజం



కళా "రాజ సులోచన" భక్తిగ,
మోజున పస్సెనను జూపి మోదమొందుచుగన
రాజున పి.యస్. రావును
రాజిల్లగ చేసె చిత్ర రంగమ్మధికున్!!

(డిసెంబర్ 20 దళకుడు సీ.యస్.రావు జయంతి...)

-రాధశ్రీ
సెల్: 9494481210

గుజరాత్‌లో దారుణం

కుమార్తెలను చంపితండ్రి ఆత్మహత్య

గాంధీనగర్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): గుజరాత్ రాష్ట్రంలోని జునాగఢ్ జిల్లా ఖంబాలియా గ్రామంలో అమానుష సంఘటన చోటుచేసుకుంది.

తన ముగ్గురు కుమార్తెలను ఓ తండ్రి హత్య చేసి అనంతరం తాను ఆత్మహత్య చేసుకున్నాడు. వరుసగా నాలుగోసారి కూడా ఆడపిల్లే పుట్టిందన్న ఆగ్రహంతో తండ్రి ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లుగా పోలీసులు వెల్లడించారు.

తండ్రి సోలంకి(30) తన ముగ్గురు కుమార్తెలను బావిలోకి తోసి హత్య చేశాడు. ఆ సమయంలో భార్య కాన్పు నిమిత్తం తన పుట్టింట్లో ఉంది.

దేశంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి : కేజ్రీవాల్

హైదరాబాద్ డిసెంబర్ 19:: దేశంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల గురించి ఆయన మాట్లాడారు. దేశ పౌరుల్లో ఆ చట్టంపై భయం నెలకొన్నదన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశ యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పౌరసత్వ సవరణ చట్టంతో దేశ ప్రజలకు ఎటువంటి విఘాతం లేదని కర్నాటక సీఎం యడ్యూరప్ప తెలిపారు. సంయమనంతో ఉండాలని ఆయన ప్రజలను, రాజకీయ పార్టీలను కోరారు. భారత్‌లో పౌరసత్వం ఆశిస్తున్న ఇతర దేశస్తులకు మాత్రమే ఆ చట్టం వర్తిస్తుందని ఆయన తెలిపారు.

సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకు రావాలి..!!

నేటినిజం
శుక్రవారం 20-12-2019

విత్తన రంగంలో భారత్ ప్రపంచంలోనే ఆరో స్థానంలో ఉంది. గడచిన ఐదు సంవత్సరాలుగా ఏటా 12 శాతం వృద్ధితో తొమ్మిదివేల రూపాయలతో ఈ రంగం ముందుకెళ్తోంది. వచ్చే నాలుగేళ్ళలో 17 శాతం వృద్ధితో ప్రపంచంలో మూడు లేదా నాలుగో స్థానానికి మనదేశం చేరుకోగలదని ఇప్పటి అంచనా.

తెలంగాణ ప్రభుత్వం విత్తనోత్పత్తి రంగంలో వ్యూహాత్మకంగా ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. నేడు దాదాపు అన్ని వాణిజ్య పంటల్లో 50 శాతానికి పైగా సంగర వంగడాలను రైతులు సాగుచేస్తున్నారు. వీటిలో 80 శాతానికి పైగా విత్తనాలు ప్రైవేటు సంస్థలపై ఆధారపడటం అధికమైనది. పత్తి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, సజ్జ, సోయాచిక్కుడు, కూరగాయల వంటి పైర్లలో సంకర వంగడాలతో నూరు శాతం విత్తన మార్పిడి సాగింది. ఇది పంటల ఉత్పత్తి ఉత్పాదకతలపై నేరుగా ప్రభావం చూపుతుంది. విత్తన మార్పిడి శాతాన్ని గణనీయంగా పెంచాలని కేంద్రప్రభుత్వం సంకల్పించింది. ప్రైవేటు రంగంలో ఎక్కువ దిగుబడినిచ్చే చీడపీడలను తట్టుకునే అధిక విలువ గల సరికొత్త సంకర వంగడాలు, మేలురకాల అభివృద్ధి సరఫరాలన్నీ చక్కటి సమన్వయంతో సాగుతుండటంతో అద్భుత ఫలితాలు వస్తున్నాయి. ప్రైవేటు రంగం ఇందుకోసం భారీగా నిధులు కేటాయిస్తోంది.

అన్ని మౌలిక వసతులూ కల్పిస్తోంది. నిపుణులైన శాస్త్రవేత్తల కృషి తోడవుతోంది.

వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ పరిశోధనా సంస్థలు కొత్త వంగడాలను రూపొందించి విడుదల చేస్తున్నా వాటి విత్తనాలను రైతుల ముంగిట చేర్చడంలో ప్రభుత్వ విత్తన సంస్థలు విఫలమవుతున్నాయి.

కాలక్రమంలో ప్రభుత్వం రంగంలోని విత్తనోత్పత్తి క్షేత్రాలు, విత్తన అభివృద్ధి ధ్రువీకరణ సంస్థల నిధులలేమి, సిబ్బంది కొరత వల్ల సంక్షోభం పాలై కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ విత్తన సంస్థలు నీరుగారిపోయాయి. రైతులు విత్తనాల కోసం ప్రైవేటు రంగంపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది. కాబట్టి తెలంగాణ సర్కారు విత్తనోత్పత్తి పంపిణీకి ముందస్తు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలి. పలు పంటల్లో రైతులకు అందించే రాయితీ విత్తనాల కోసం ప్రభుత్వం ఏటా వందల కోట్ల రూపాయలు ప్రైవేటు కంపెనీలకు చెల్లించి వారినుంచే సేకరిస్తోంది. అంతవరకు బాగానే ఉన్నా ముందుగా విత్తన పంటలు సాగుచేసే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చి బలోపేతం చేయాలి. ఈ విషయంలో ఒడిశా ప్రభుత్వం ముందుంది.

ఎకరాకు ఇంతని ఇచ్చుకోవడం ఆనవాయితీగా పెట్టుకుంది. ఇందులో కూలీల కొరత, నీటి కొరత కలవర పెడుతోంది. దీనికి తోడు దళారుల జోక్యం మరింత పెరిగింది.

ఇప్పటికైనా లొసుగులు సరిచేసుకుని, సమగ్ర విత్తన చట్టాన్ని కొత్త రాష్ట్రంలో తెస్తే చాలా బావుంటుంది. రైతులు తామే విత్తనాలను సొంతంగా అమ్ముకునే స్వేచ్ఛ ఉండాలి. నకిలీ నాసిరకం విత్తనాలను రైతులకందించే విధానాలకు స్వస్తి చెప్పి ఇప్పటికైనా విత్తనాల సరఫరాకు సమస్తం గ్రామాలు కావాలి...!

పశుబీమాపై రైతుల్లో చైతన్యం

పథకం అమలుపై ప్రచారానికి సన్నాహాలు

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): పాడిరైతులను ప్రోత్సహించేందుకు పాడి పశువులను కోల్పోయిన రైతులు నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చాయి. పశువు ఏ కారణంతోనైనా మరణిస్తే దాని పూర్తి విలువను బీమా ద్వారా చెల్లించే విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. దీంతో గ్రామాల్లో దీనిపై ప్రచారం చేసి రైతులను చైతన్యం చేసేలా ప్రోత్సహించాలని పశుసంవర్ధక అధికారులకు ఆదేవాలు ఇచ్చారు. దేశవాళీ, సంకరజాతి ఆవులు, బర్రెల్లో చూలు పశువు అయినా, పాలిచ్చేదైనా, ఎండిపోయినదైనా, ఒకసారి ఈనని ప్రతి ఆవు, బర్రెకు ఈ పథకం వర్తిస్తుంది. పదేళ్లలోపు ఉండి ఐదు ఈతలకు మించని పశువులై ఉండాలని అధికారులు చెబుతున్నారు. మార్కెట్ విలువనుబట్టి 10వేల నుంచి 60వేల వరకు పశువులపై బీమా చేసుకోవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. పశును కోల్పోయినపుడు ఈ మొత్తాన్ని బీమా కంపెనీ ద్వారా పొందే అవకాశం ఉంటుంది. వ్యవసాయ అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న పశు సంపదతోపాటు ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా సబ్సిడీపై అందిస్తున్న పాడి పశువులు పలు కారణాలతో మృత్యువాత పడడంతో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఇటీవలి కాలంలో బ్యాంకుల ద్వారా రుణం తీసుకొని పాడి పశువులు కొనుగోలు చేసుకుంటున్న రైతులకు పశు వైద్యాధికారులే ప్రీమియం నిలుపుకొని రైతులకు అందిస్తున్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం ప్రీమియం భరిస్తుంటే రైతులు మరో 20 శాతం మాత్రమే ప్రీమియం చెల్లించాల్సి ఉంది. దేశవాళీ, అధిక పాల ఉత్పత్తిని ఇచ్చే పాడి పశువులకు అవకాశం కల్పించారు. ఒక ఏడాదికి లేదా మూడేళ్ల కోసం బీమా సదుపాయం కల్పిస్తున్నారు. పాడి పశువులు ఉన్న ప్రతి వర్గం రైతులు ఈ బీమా పథకంలో చేరేందుకు అర్హులని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మొత్తంలో 20 శాతం షెడ్యూలు కులాల రైతులు ఉండేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ పథకం అమల్లోకి వచ్చాక జిల్లాల్లో అనేక మంది రైతులు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు వస్తున్నారని అధికారులు తెలిపారు. బీమా సదుపాయం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమల్లో ఉంది. పశువులు ప్రమాదాలకు గురైనా, వ్యాధుల బారినపడినా, ప్రకృతి వైపరీత్యాల వల్లనైనా మృత్యువాత పడితే బీమా వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకం కింద ఏడాది పాటుగానీ, మూడేళ్లపాటుగానీ పశువులకు బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చు. మూడేళ్ల కాలానికి ప్రీమియం చెల్లిస్తేనే రైతులకు లాభం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. బీమా కోసం రైతులు స్థానిక గోపాలమిత్ర, ప్రభుత్వ పశువైద్యశాల సిబ్బంది, డివిజన్, జిల్లాస్థాయి పశుసంవర్ధక అధికారులు, బీమా కంపెనీ, కార్యనిర్వాహక అధికారిని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. బీమా చేసిన పశువును అమ్ముకోవాల్సి వస్తే కొనుగోలు చేసిన రైతుకు కూడా వర్తిస్తుందనీ, పశువు యూనిట్‌గా బీమా ప్రీమియం చెల్లింపు జరుగుతున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. చాలా మంది రైతులకు పాడి ప్రధాన ఆదాయ వనరుగా మారింది. వేలకు వేలు వెచ్చించి రైతులు పశువులను కొనుగోలు చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ వర్గాలకు చెందిన రైతులకు రాయితీపై పాడి పశువులను అందించి ప్రోత్సహిస్తున్నాయి. ఇలా రైతులు సొంతంగా కొనుగోలు చేసుకున్నవిగానీ, రాయితీపై ఇచ్చినవిగానీ వివిధ కారణాలో మృత్యువాత పడితే రైతులు కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతున్నది. తిరిగి పశువును కొనుగోలు చేయాలంటే రైతులు అప్పులు చేయాల్సి వస్తున్నది. పాడి రైతులు తమకున్న ఎన్ని పశువులకైనా బీమా చేసుకునే అవకాశం ఉంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రీమియం రాయితీ మాత్రం ఒక రైతుకు చెందిన ఐదు పశువులకు మాత్రమే వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. మిగతా పశువులకు వంద శాతం ప్రీమియం రైతులే చెల్లించుకోవాల్సి ఉంటుందని వారు వివరిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పథకాల అమలుపై ఆరా

-ప్రజల్లో స్పందనపై అధ్యయనం

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): క్షేత్రస్థాయిలో పథకాల ప్రభావంపై అధ్యయనంకోసం సంయుక్తగా ఫీల్డ్ సర్వే నిర్వహించేందుకు ప్రణాళిక శాఖకు చెందిన ప్లానింగ్ సొసైటీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

క్షేత్రస్థాయిలో అమలవుతున్న పథకాల వివరాలు తెలుసుకోవడం, వాటిని క్రోడీకరించి ఎక్కడెక్కడ ఏయే మార్పులు చేస్తే ఇంకా మెరుగైన ఫలితాలు వస్తాయో అన్న ఆలోచన చేస్తోంది. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి తదితరరంగాల్లో విప్లవాత్మక తీరులో పథకాలు చేపడుతున్నది. అయితే ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయి? పథకాల అమలుతో అభివృద్ధి సూచిక ఏరకంగా ప్రభావితం అవుతున్నదనే విషయాలపై అధ్యయనం చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీతిఆయోగ్ గౌరవ సలహాదారు కార్తీ మురళీధరన్ నేతృత్వంలోని సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ తో రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికశాఖ అక్టోబర్ 16న ఒప్పందం కుదుర్చుకున్నది. ఇప్పటికే సీఈజీఐఎస్ అధ్యయనం మొదలుపెట్టింది. కార్తి మురళీధరన్ నేతృత్వంలోని 12 మంది ప్రతినిధుల బృందం రాష్ట్రంలో మూడురోజుల తొలి పర్యటనను పూర్తిచేసింది. విద్య, వైద్యం,గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉపాధి తదితర రంగాల్లో పథకాలు ఎలా ఉన్నాయి?ఎలా అమలవుతున్నాయి? క్షేత్రస్థాయిలో వాటి ఆచరణ, ప్రజలకు అందుతున్న సంక్షేమఫలాలకు సంబంధించి ఈ ప్రతినిధి బృందం వివిధశాఖల ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఉద్యోగుల వేతనాలు, వారి పనివిధానం, వేతనాల పెంపుదలపై పీఆర్సీతో కూడా భేటీ అయింది. ఆర్థికమంత్రి హరీశ్ రావు, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్‌కుమార్, ఆర్థికశాఖ అధికారులతో బృందం సభ్యులు సమావేశమయ్యారు. సూచనలు చేయడం కోసం కార్తి మురళీధరన్ నేతృత్వంలోని బృందం సమావేశాలు నిర్వహించిందని అధికారులు చెప్పారు. ప్రభుత్వం అన్నివర్గాల పేదపిల్లలకు ఉచితంగా నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించడానికి గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేసింది. వీటితో నాణ్యమైన విద్య ఎంతవరకు అందుతున్నది? ఇంకా ఏరకంగా మెరుగుపర్చవచ్చు? అనే అంశాలపై ఈ సంస్థ సలహాలు, సూచనలు ఇవ్వనున్నది. కేసీఆర్ కిట్ పథకం అమలుద్వారా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెరిగాయి. దాదాపు 60 శాతం ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లోనే జరుగుతున్నాయి. అయితే సిజేరియన్ ఆపరేషన్స్ ను కూడా పూర్తిస్థాయిలో నిరోధించాల్సి ఉన్నది. మిగిలిన 40 శాతంలో కూడ మరిన్ని ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లో చేయించటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశంపై సీఈజీఐఎస్ సూచనలు ఇవ్వనున్నది. కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకం ప్రారంభించిన తర్వాత రాష్ట్రంలో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో బాలికలకు మెరుగైన విద్య అందించడం ఎలా? అనే అంశంపైనా సీఈజీఐఎస్ అధ్యయనం చేయనున్నది. సీఈజీఐఎస్‌తో అవగాహన మేరకు ప్రణాళిక శాఖకు చెందిన స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ.. 33 జిల్లాల్లో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించడానికి ఏజెన్సీలను ఆహ్వానించింది. మొత్తంగా పథకాలను ప్రజలకు చేర్చడంతో ప్రజల్లో స్పందన ఎలా ఉందన్న ఆరా కూడా తీస్తున్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

ఆదిలాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఉద్యానవన పంటలతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఉద్యానవన, పట్టు పరిశ్రమ అభివృద్ధి అధికారి శ్యాంరావ్ రాథోడ్ అన్నారు. రైతుల చేన్లలో అమర్చిన బిందుసేద్యం సిస్టమ్‌ను నాబార్డు డీజీఎంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శ్యాంరావ్ మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యం పరికరాల వినియోగంపై ఆరా తీయడానికి క్షేత్రస్థాయిలో వెళ్లి సందర్శించామన్నారు. గతంలో నాబార్డు నిధుల ద్వారా రైతులకు బిందు, తుంపర్ల ఇరిగేషన్ సిస్టమ్ ఇచ్చామని చెప్పారు. ఈ మేరకు బ్యాంకు డీజీఎంతో కలిసి రైతుల పంట పొలాలకు వెళ్లి పరిశీలించామన్నారు. పథకం పక్కదారి పట్టకుండా తెలుసుకుంటున్నామన్నారు. రైతులు వివిధ రకాల పంటలతోపాటు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఉద్యానవన పంటలను సాగు చేయాలని సూచించారు.

విద్యుత్ రంగంలో అద్భుత ఫలితాలు: మంత్రి జగదీష్ రెడ్డి



సూర్యాపేట, డిసెంబర్ 19: కార్మిక సంఘాలలో రాజకీయాల ప్రమేయం ఉండకూడదని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజకీయాలను కార్మిక సంఘాలతో జొప్పించడంతో ప్రపంచవ్యాప్తంగా పలు సంస్థలు దెబ్బతిన్నాయన్నారు. ఇవాళ సూర్యపేట జిల్లా కేంద్రంలో 1104 విద్యుత్ ఉద్యోగుల నూతన సంఘ కార్యాలయ భవనాన్ని మంత్రి జగదీష్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ..హక్కుల సాధనకు కార్మిక సంఘాలు ముందున్నప్పుడే ఆ సంస్థలు పురోగతిలో ఉంటాయని అన్నారు. అటువంటి పురోగతిలో ఉన్న సంస్థనే తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగ సంస్థలని ఆయన కొనియాడారు. యజమానులకు ఆర్థిక క్రమశిక్షణ, కార్మికులకు పనిలో క్రమశిక్షణ ఉండాలని ఆయన ఉపదేశించారు. అటువంటి యాజమాన్యం అదే పద్ధతిలో కార్మికులు ఉన్నందునే తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో అద్భుత ఫలితాలు సాధించిందని పేర్కొన్నారు. మంచి ఫలితాల ఆవిష్కరణలో ట్రాన్స్ కో డజెన్ కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు చేసిన కృషి చాలా ఉందన్నారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వంలో జరిగిన రెండవ నియామకమే ప్రభాకర్ రావుదని, ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పానికి ప్రభాకర్ నియామకం ఒక నిదర్శనమన్నారు.

వ్యవసాయం పట్ల తెలంగాణ పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ కున్న దార్శనికత కు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరాకు అద్దం పడుతుందన్నారు. 2001లో మొదలైన తెలంగాణ ఉద్యమం విద్యుత్ రంగం చుట్టే తిరిగితే 2004 ఎన్నికలలో జరిగిన అధికార మార్పిడికి విద్యుత్ సంక్షోభం కేంద్రంగా నిలిచిందన్నారు. అదే విదంగా కేంద్రం ప్రకటించిన తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకునేందుకు కూడా కుట్రలు కుతంత్రాలు విద్యుత్ రంగం చుట్టే తిరిగాయన్న విషయం విస్మరించరాదన్నారు. అటువంటి గడ్డు పరిస్థితుల్లో ఉన్న విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టి 2014 ఎన్నికల హామీలో చెప్పిన విధంగా నిరంతర విద్యుత్ ను మూడేండ్లలో అందించిన ఘనత ముమ్మాటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ దే నన్నారు. అటువంటి సంస్థ పురోగతిలో యాజమాన్యాలతో పాటు సిబ్బంది పాత్ర కీలకంగా ఉందన్నారు. అదే సమయంలో విద్యుత్ ప్రమాదాలను నివారించడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణాలు విలువైనవి అని తిరిగి తేలేని ప్రాణాలు కాపాడడం విద్యుత్ సిబ్బంది కొంచెం జాగురుకతో వ్యహరిస్తే ప్రమాదాలను నివారించడం కష్ట సాధ్యం కాదన్నారు.

ఈ కార్యక్రమంలో 1104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబ, అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, నాయకులు కలువల సత్యనారాయణ రావు సూర్యపేట జిల్లా 1104 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకన్న, ఇతర సభ్యులు సుధీర్, ఆర్.జనార్దన్ ,శంకర్, పాల్ రాజు, రవికాంత్ శర్మ, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక విధానాలపై సమీక్ష అవసరం

హైదరాబాద్, డిసెంబర్ 19:మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజల నడ్డి విరిచేలా చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారుతున్నా చర్యలు తీసుకోవడంలేదు. రఘురామరాజన్ లాంటి వారు చేస్తున్న సూచనలు చెవికెక్కడం లేదు. పోనీ దేశంలో ఆర్థికరంగ నిపుణులకు కొదవలేదు. వారి సలహాలైనా తీసుకుని ఉంటే గండం గట్టెక్కించే ఉపాయం చేపట్టవచ్చు. అయితే అలాంటి ప్రయత్నాలు జరుగతున్న జాడ కానరావడం లేదు. ఆర్థిక కసరత్తులతో వచ్చే బడ్జెట్‌కు రూపకల్పన చేస్తున్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కనీసంగా అయినా ఈ దుష్ఫలితాలపై సలహాలు తీసుకుంటున్నారా అన్నది కూడా అనుమానంగానే ఉంది. కిందిస్థాయిలో ఏం జరుగుతందో తెలుసుకోలేని ప్రధాని మోడీ కేవలం తాను అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రజలు ఆమోదించారన్న ధోరణిలో ఉన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ భేషుగ్గా ఉందన్న వాదనలుచేస్తున్నారు. నిజానికి ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటే ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల వంటి సమస్యలు రావు. ఆహార ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నా ధరలు మాత్రం దిగి రావడం లేదు. దిగుమతులు అదేపనిగా పెరగడం వల్ల కూడా ఆర్థిక మాంద్యానికి కారణంగా చూడాలి. ఎగుమతులు తగ్గడం వల్ల కూడా విదేశీమారక ద్రవ్యం భారం పెరుగుతోందన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. దివంగత మాజీప్రధాని పివి నరసింహారావు పుణ్యమా అని ఆయన ప్రవేశ పెట్టిన సంస్కరణలు దేశ ప్రజలను గడపదాటి బయటకు వెళ్లేలా చేశాయి. ప్రజలు ప్రపంచాన్ని చూసేలా చేశాయి. ప్రపంచం భారత్ వైపు చూసేలా చేసింది. పెట్టుబడులు వెల్లువలా వచ్చి పడ్డాయి. ప్రపంచ మార్కెట్లు భారత్‌కు చేరాయి. అలాగే మన మార్కెట్లు జోరందుకున్నాయి. మన వస్తువులు విదేశాలకు చేరాయి. సరళీకృత ఆర్థిక విధానాలు సామాన్యుడికి కడుపునిండా భోజనం పెట్టేలా చేశాయి. ప్రతి వస్తువును కొనుగోలు చేసేలా చేశాయి. కానీ మోడీ అనుసరిస్తున్న విధానాల కారణంగా కేవలం కార్పొరేట్ శక్తులు బలపడుతున్న తీరు ప్రజలను కలచి వేస్తోంది. పేద,సామాన్య ప్రజలు ఎంతగా చితకి పోతున్నారో గమనించడం లేదు. జిఎస్టీ కారణంగా వస్తువల ధరలు పెరిగితే ఎవరికి నష్టమో ఎందుకు ఆలోచన చేయడం లేదు. దేనిని వదలకుండా జిఎస్టీ పరిధిలోకి తీసుకుని వచ్చినంత మాత్రాన, ప్రభుత్వ ఆదాయం పెరిగినంత మాత్రాన ఆర్థిక సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయంటే ఎవరిని వంచించడానికి అన్నది ఆలోచన చేయాలి. ప్రజా నాయకులైతే ఇలాంటి విధానాలు పరిశీలన చేసుకోవాలి. ప్రజలకు గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసి, ప్రధాని పదవిని చేపట్టిన మోడీ తీరు కారణంగా ఆర్థిక మందగమనం ప్రజలకు శాపంగా మారింది. ఇలాగే ముందుకు సాగితే ప్రజల్లో ఉన్న అసంతృప్త జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపుతాయ నడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గమనించి సర్దుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని గమనించాలి. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించలేక పోతున్నామని గమనించాలి. ప్రధాని మోడీ ఛరిష్మా, పాలనా సంస్కరణలు బాగా ఉంటే ఇటీవలి మహారాష్ట్రలో ఫలితాలు అనుకూలంగా ఉండేవి. కేవలం రాహుల్‌ను, కాంగ్రెస్‌ను తిట్టిపోస్తూ రాజకీయం చేయడమే పాలన కాదు. పాలనలో కొత్త ఒరవడి సృష్టించాలి. ప్రజలకు మేలు జరిగేల సంస్కరణలు ఉండాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి. ఆహారధాన్యాల ధరలు తగ్గాలి. సంస్కరణలంటే ఇవే తప్ప మరోటి కాదని గుర్తుంచుకోవాలి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ధరలను, నేటి మార్కెట్ ధరలను ఎందుకు బేరీజు వేసుకోవడం లేదో ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలి. మోడీ అనుసరిస్తున్న పిడివాద సంస్కరణల ఫలితమని గుర్తించాలి. తాము అనుసరిస్తున్న సంస్కరణలు ఎక్కడ దారితప్పాయో గమనించాలి. పివి నరసింహారావు లాగా సంస్కరణలు ప్రజలకు

ఎందుకు మేలు చేయలేకపోతున్నాయో పరిశీలన చేయాలి. ఇప్పటికైనా నోట్లరద్దు,జిఎస్టీ వివరణామాలను విశ్లేషించుకోవాలి. దేశంలో అసాధారణ రీతిలో ఆర్థికమాంద్యం పెరిగిపోవటంపట్ల ఆయా రాష్ట్రాల ఆర్థికమంత్రులు ఆందోళన వ్యక్తంచేశారు. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) దారుణంగా పడిపోతున్నదన్నారు. జీడీపీ ఏటా భారీగా తగ్గుతూ వస్తున్న విషయాన్ని జిఎస్టీ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జీడీపీ 8.2 శాతం నుంచి 4.5 శాతానికి పడిపోవటం ఆందోళనకర పరిణామంగా అభివర్ణించారు. బ్యాంకుల బకాయిలు, నిరర్థక ఆస్తులు పెరిగిపోవటం పరిస్థితిని మరింత దిగజారుస్తున్నదని చెప్పారు. కేంద్రం సంక్షేమ పథకాలను తగ్గించి, రాష్ట్రాల మ్యాచింగ్ గ్రాంట్లను పెంచడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. కేంద్రం గతంలోలాగే మ్యాచింగ్ గ్రాంట్లను భరించాలని కోరారు. దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు తగ్గడంవల్ల రాష్ట్రాలకు కలిగిన ఇబ్బందులను మంత్రి సమావేశంలో ప్రస్తావించారు. గ్రాస్ ట్యాక్స్ రెవెన్యూలో 31శాతంతగ్గగా, రాష్ట్రాల సొంత రాబడిలో 47శాతం వరకు లోటు ఏర్పడిందని విశ్లేషించారు. ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ నిధులను రాష్ట్రాలకు కేటాయించే విధానంలో మార్పు తీసుకురావాల్సిన అవసరమున్నదని సూచించారు. విమర్శలను హెచ్చరికగా తీసుకుని ముందుకు సాగితే తప్ప మనలేమని గుర్తించి ప్రజలకు మేలుచేసే సంస్కరణలను అమలు చేయాలి. అప్పుడే బిజెపి తన అస్తిత్వాన్ని నిలుపుకోగలదు.

కలెక్టర్‌గా రెండేళ్లు పూర్తి చేసుకున్న దివ్య

ప్రభుత్వ పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ

ఆదిలాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ కలెక్టర్‌గా నియమితులైన దివ్య దేవరాజన్ బాధ్యతుల చేపట్టి రెండేళు కావస్తోంది. దీంతో ఆమె జిల్లాలో తనదైన ముద్రవేసి ముందుకు సాగుతున్నారు. ప్రధానంగా ప్రజలతో నేరుగా సంబంధాలు పెట్టుకుని కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళుతున్నారు.

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రోజునుంచే అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అధికారగణం ఒక్కొక్కరుగా పరిచయం చేసుకున్నారు.జిల్లాను ప్రగతిబాటన పయనింప జేస్తానని తెలిపిన మేరకు కృషి చేస్తున్నాయని గుర్తుచేశారు. గ్రామ ప్రణాళికలో దాతలెందరో భూములు, డబ్బులు విరాళాలుగా ఇవ్వటం సంతోషకరమన్నారు.

పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దిన గ్రామాలకు జనవరి 26 లేదా జూన్ 2న బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. తడి, పొడి చెత్తను ప్రజలు వేర్వేరుగా చెత్తబుట్టలలో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసుకొని చేలకు మొక్కలకు వాడవచ్చని గుర్తుచేశారు. జనవరి 2 నుంచి రెండో విడత ప్లలె ప్రణాళిక మొదలు కానుందని వెల్లడించారు. గ్రామాల పరిశుభ్రతతోనే ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉంటారనే ప్రణాళికకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు.

అడవుల రక్షణకు కఠిన చర్యలు

రిజర్వ్ ఫారెస్ట్‌లోకి రాకుండా నిబంధనలు

భద్రాద్రి కొత్తగూడెం,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): రిజర్వ్ ఫారెస్టక్షణకు అధికారులు నడుం బిగించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు. దీంతో అడవుల పరిరక్షణకు ముందుగా రిజర్వ్ ఫారెస్టు ప్రాంతాన్ని విభజిస్తూ ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అడవుల్లో మంటలు విస్తరించకుండా ప్రత్యే కంగా ఫైర్లైన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అటవీ హక్కు పత్రాలు లేని పోడు భూములను ఈ వేసవిలోపు స్వాధీనం చేసకుంటామని కూడా అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాలోని అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టడాన్ని ఇకమీదట సహించబోమని, రిజర్వ్ ఫారెస్టు యాక్ట్ పరిధిలో కఠిన చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు. గడిచిన కొన్నేళ్ళుగా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏటా వేసవి ప్రారంభంలో రిజర్వ్ ఫారెస్టు పరిధిలోని ఒకే ప్రాంతంలో మంటలు చెలరేగుతున్నట్లు గూగుల్ ద్వారా కేంద్ర ప్రభు త్వం గుర్తించిందన్నారు. ఇల్లెందు ఫారెస్టు డివిజన్‌లో 252 కంపార్ట్‌మెంట్లు ఉండగా అందులో 23 కంపార్ట్ మెంట్లలో ప్రతి ఏటా మంటలు చెలరేగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ నిఘాలో వెల్లడైందని పేర్కొన్నారు. ముఖ్యంగా రిజర్వ్ ఫారెస్టు ప్రాంతంలో సాగు చేసుకుంటున్న రైతులు మొక్కజొన్న చెత్తను తరగలబెట్టడం వల్ల మంటలు అడ విలోకి విస్తరించి అడవికి నష్టం చేకూరుతందున్నారు. ఇంతేకాకుండా బీడీ ఆకుల సేకరణ సందర్భంగా అడవికి మంటలు పెడుతున్నట

భూగర్భ జలాలను కాపాడుకోవాలి

ఆటోస్టార్టర్ల తొలగింపుపై నేతల పిలుపు

సిద్దిపేట,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఉద్యమంలో ముందు వరుసలో ఉన్న సిద్దిపేట ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపులోనూ ఆదర్శంగా ఉండాలని టిఆర్ఎస్ శ్రేణులు సూచించారు. ఉచిత నిరంతర విద్యుత్ అందించి రెండేళ్లు కావస్తున్న సందర్భంగా వీటిని కూడా తొలగించాల్సి ఉందన్నారు. రైతుల సంక్షేమానికి సబ్సిడీపై ముందస్తుగా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నామన్నారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న రైతుల భూసమస్యలు పరిష్కరించేందుకు భూరికార్డుల ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సబ్సిడీపై స్ప్రిం÷-రక్లర్లు, డ్రిప్, పాలీహౌస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టిందన్నారు. మంత్రి హరీష్ రావు ఆదేశాలతో గ్రామాల్లో ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపుపై ప్రచారం చేస్తున్నారు. రైతులను పలకరిస్తూ 24 కరెంట్‌పై ప్రచారం చేస్తున్నారు. గతంలో వచ్చిపోయే కరెంట్ కోసం రైతులంతా ఆటోమేటిక్ స్టార్టర్లు కొనుక్కున్నారు.. ప్రస్తుతం సీఎం కేసీఆర్ రైతాంగానికి ఉచితంగా 24 గంటల కరెంట్‌ను ఇస్తున్నారు. గత ఆరు మాసాలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇస్తున్నారు.ఇప్పుడు నాణ్యమైన కరెంట్ వస్తున్నందన ఇక ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగిద్దాం. భూగర్భ జలాలు కాపాడుకుందాం అన్ంన నినాదాలతో సాగుతున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పత్తి మార్కెట్ యార్డులో జిల్లాలోని రైతు సమన్వయ సమితి సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు, మహిళలతో ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపుపై ఇటీవల అవగాహన సదస్సు నిర్వహించారు. దీంతో రైతులకు కావాల్సినంత కరెంట్ ఇస్తున్నందున ఇక స్టార్టర్లను కూడా తొలగించి సహకరించాలన్నారు. ఆటోమేటిక్ స్టార్టర్ల వాడకం వల్ల అవసరానికి మించి నీటిని తోడేస్తూ భూగర్భజలాలుఅడుగంటడమే గాకుండా కరెంట్ వృధా కానుందని పలువురు హెచ్చరించారు. రాష్ట్రం ఏర్పడక ముందు లోవోల్టేజీ సమస్యతో కరెంట్ మోటర్లు, స్టార్టర్లు కాలిపోయేవన్నారు. రైతులందరి మేలు కోసం ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగించే కార్యక్రమానికి అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఇందుకోసం సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతులతో కమిటీలు వేసి ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగిద్దామని రైతులకు సూచించారు. నీటిని పొదుపుగా వాడుకొని పంటలు పరిరక్షించుకుందామన్నారు. ప్రభుత్వం వచ్చే వానకాలం నుంచి రైతులకు ఎకరాకు రూ.8వేల పెట్టుబడి ఇస్తున్నదని, రైతులు తమ ధాన్యానికి మద్దతు ధరకు అమ్ముకున్నందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ఆటోస్టార్టర్లను తొలగించి విద్యుత్ ఆదా చేద్దాం

-జిల్లాను ఆదర్శంగా నిలుపుదాం: ఎమ్మెల్యే

జనగామ,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రైతులకు 24 గంటలపాటు వ్యవసాయానికి త్రీఫేజు విద్యుత్‌ను అందిస్తున్నామని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి చెప్పారు. ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించడం వల్ల భూగర్భ జలాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులందరిపైనా ఉందన్నారు.

ఆటోమేటిక్ స్టార్టర్లను స్వచ్ఛందంగా తొలగించి రాష్ట్రానికే మన జిల్లా ఆదర్శమని నిరూపించాలన్నారు. గత ప్రభుత్వాలు ఐటీ కంపెనీలకు నాణ్యమైన కరెంట్ ఇచ్చి రైతులకు మాత్రం లోవోల్టేజీతో కూడిన కరెంట్‌ను ఇచ్చేవారన్నారు. సీఎం కేసీఆర్ నాణ్యమైన కరెంట్‌ను అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం 24 గంటలు కరెంట్ సరఫరా అవుతున్నందున అవసరం ఉన్నా, లేకున్నా ఆటోమేటిక్ స్టార్టర్లను వినియోగించడం వల్ల భూగర్భజలాలు తగ్గుతాయన్నారు. ఎండాకాలంలో వరి పంటలు పొట్టకు వచ్చే సమయంలో నీటి కొరత వచ్చి పంటలు ఎండి పోయే ప్రమాదం ఉందన్నారు. వరి పంటకు మడిలో ఎంత నీరు అవసరం ఉందో అంతే నీరు నిల్వ ఉంచి నీటిని పొదుపు చేస్తూ పంట దిగుబడులు పెంచుకోవాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే నూతన మెలకువలు రైతులు తెలుసుకోవాలన్నారు. ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపు వల్ల విద్యుత్ ట్రిప్ అవుతుందన్న అనుమానాలు కొందరు వ్యక్తం చేయగా, అలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. రెప్పపాటు కరెంట్ కూడా పోదన్నారు.

సామాజిక తెలంగాణ ఆకాంక్ష తీరలేదు

-సమస్యల పరిష్కారంలో పాలకుల విఫలం: సిపిఐ

ఆదిలాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తరవాత పాలకులు మారారరని, పాలన మారలేదని సిపిఐ జిల్లా నాయకుడు కలవేన శంకర్ అన్నారు. టిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. స్వరాష్ట్రంలో కూడా ఆత్మహత్యలు ఆగలేదని తెలిపారు. ఇది బాధాకరమైన విషయమన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సంస్కృతికంగా ప్రజలకు పెద్ద మార్పు జరగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక కూడా పరిస్థితులు మారలేదన్నారు. తెలంగాణ సమస్య అంటే భూమి, నీళ్ల సమస్యేనని చెప్పారు. దానికోసమే కొట్లాట జరిదిందన్నారు. కానీ అదే నెరవేర లేదన్నారు. మా భూములు మాకని తెలంగాణ ప్రజలడిగినప్పుడు మీ భూములు మీకు కాదు, మూడున్నర ఎకరాలు ఇస్తామన్నారు, ఆచరణలో ఎవరికీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇంటికో ఉద్యోగమన్నారు, ఏదని అడిగితే సమాధానం లేదని తూర్పార బట్టారు. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అన్నారు...ఇది కూడా అతీగతి లేదని మండిపడ్డారు. పింఛన్ పెంచారు, భార్యకిస్తే భర్తకు లేదు, భర్తకిస్తే భార్యకు లేదని వృద్ధుల ఉసురు పోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. గూడు లేని వాళ్లకు రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని చెప్పిన పాలకులు విఫలమయ్యారని అన్నారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు భూ సమస్య అనేది పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యమనేది గంగలో కలిసిందని మండిపడ్డారు. అన్ని వర్గాల సామాజిక న్యాయం కోసం మరో తెలంగాణ సామాజిక ఉద్యమం రావాల్సి ఉందన్నారు.

సాగునీటి సక్రమ వినియోగం

-ప్రాజెక్టుల కింది విడుదలకు అంచనా

సంగారెడ్డి,డిసెంబర్19(నేటినిజం ప్రతినిధి): యాసంగి సాగుకు ప్రాజెక్టుల నుంచి నీరందించేందుకు ఉన్ననీటిని పంపిణీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాధ్యమైనంత ఎక్కువ ఎకరాలకు నీరందించాలని మంత్రి సూచించడంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఆ మేరకు సాగునీటిని విడుదల చేయాలని ఆదేశించారు.

ఈ యాసంగిలో సింగూరు ప్రాజెక్టు, ఘణపురం ఆయకట్టు కింద సాగునీరందించే ఏర్పాట్లు చేస్తున్నారు. యాసంగిలో జలవనరుల నుంచి సాధ్యమైనంత ఎక్కువ ఎకరాలకు సాగునీరందించాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని సూచించారు.

సాగుకు నీరందించే విషయంలో వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసేలా చూస్తున్నారు. ప్రణాళిక బద్ధంగా నీటి విడుదల ఉండాలని ఆదేశించారు. నల్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణకు ఇటీవలే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆధునీకరణ చేపట్టాల్సి ఉండగా ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలపై రైతుల నుంచి భిన్నాభిప్రాయాలు అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. కొందరు రైతులు క్రాప్ హాలిడే ప్రకటించి పనులు చేపట్టాలని, మరికొందరు పంటలకు నీరివ్వాలని కోరుతున్నారు. ఈ క్రమంలో రైతులకు ఇబ్బంది లేకుండా వారి అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

విద్యార్థులపై లాఠీఛార్జి తప్పే

- బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్

న్యూఢిల్లీ, డిసెంబర్19(ఆర్ఎన్ఎ) : నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం తప్పేనని మాజీ క్రికెటర్, ఎంపీ గౌతమ్ గంభీర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నిరసనల్లో హింసకు పాల్పడి, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగిస్తే మాత్రం భద్రతా సిబ్బంది ప్రతిఘటించక తప్పదని స్పష్టం చేశారు. పౌరసత్వ సవరణ చట్టంతో దేశంలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై గంభీర్ స్పందించారు. విద్యార్థులపై లాఠీఛార్జి తప్పేనని, అక్కడేదైనా అనుకోనిది జరిగి ఆత్మరక్షణ కోసం చేస్తే మాత్రం తప్పుకాదని గౌతమ్ అన్నారు. రాళ్లు విసిరి, ప్రజల ఆస్తులను తగలబెడితే పోలీసులు కచ్చితంగా ప్రతిఘటిస్తారని, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. అందరికీ ఆ హక్కు ఉందని, మీ సమస్యలపై మీరు మాట్లాడండి.. వాటిని

పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. భవిష్యత్తులో జరగకుండా చూసుకోవడం వారి బాధ్యతేనని గంభీర్ అన్నారు. ముస్లింలకు ఈ బిల్లు వ్యతిరేకమని వస్తున్న వదంతుల్లో నిజం లేదని గంభీర్ పేర్కొన్నారు. ఈ బిల్లు పౌరసత్వం ఇవ్వడం గురించి, లాగేసుకోవడం గురించి కాదని గౌతీ పేర్కొన్నారు.

భావితరాలకు ఆరోగ్యకరమైన

వాతావరణాన్ని అందిద్దాం

- నదుల పరిరక్షణకై కేంద్రం నిర్ణయం అభినందనీయం
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్19(ఆర్ఎన్ఎ) : భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతీఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు.

బుధవారం కృష్ణా, గోదావరి నదీపరివాహక ప్రాంత పునరుజ్జీవన ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్నచర్యలకు అందరూ సహకరించాలని అన్నారు. ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని భవిష్యత్‌తరాలకు అందించాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. ఉష్ణోగ్రతలు ప్రతిఏటా పరిగిపోతున్నాయని, కానీ నీటి లభ్యత మాత్రం తగ్గిపోతోందన్నారు. వాతావరణ పరిస్థితితులు కూడా ఎప్పటికప్పుడు మారిపోతున్నాయని ఆయన అన్నారు. వీటి గురించి మాట్లాడకుండా మనం ఇంకా దేనికోసమో కొట్లాడుతున్నామని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకు అవసరమైన వాటిని వదిలేసి మన దేశ రాజకీయాలు ఇంకో వైపు వెళ్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీని పై పర్యావరణ ప్రేమికులు, శాస్త్రవేత్తల పదేళ్ల ఆందోళనల ఫలితమే గాంగాశుద్ధి నిర్ణయమని చెప్పారు. ఇప్పుడుగోదావరి, కృష్ణా నది పరివాహక ప్రాంతాల పరిరక్షణ కోసం కేంద్రం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. నదులు నిరంతరం ప్రవహిస్తూ ఉండాలంటే ఏం చేయాలన్న ఆలోచన ఇప్పటికైనా రావడం సంతోషమని అన్నారు. కృష్ణా, గోదావరి జలాలు డ్రైనేజీ నీటితో కలుషితం అవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఇరిగేషన్, ఉద్యావనశాఖ, రూరల్ డెవలప్‌మెంట్, వ్యవసాయశాఖ ఈవిషయంలో సంయుక్తంగా పనిచేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నిశాఖలు కూడా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఇవ్వగలుగుతామని అన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ డైరెక్టర్ జయప్రసాద్, శాస్త్రవేత్త డిఆర్ఎస్‌రెడ్డి, వ్యవసాయ, ఉద్యానవనశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ డిజైన్‌లో..

ఎలాంటి లోపంలేదు

- హైస్పీడ్ కారణంగానే ప్రమాదమని కమిటీ తేల్చింది
- మరో పదిరోజుల్లో వాహనాలను అనుమతిస్తాం
- జీహెచ్ఎంసీలో ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నాం
- జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్

హైదరాబాద్, డిసెంబర్19(ఆర్ఎన్ఎ) : బయో డైవర్సిటీ ఫ్లై ఓవర్ నిర్మాణంలో ఎలాంటి లోపం లేదని, హైస్పీడ్ వల్లే ఇటీవల ప్రమాదం జరిగిందని నిపుణుల కమిటీ పేర్కొందని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. 40కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వెళ్ళడం వల్లే బయో డైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై ఇటీవల ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ అనుమతి రాగానే ఫ్లై ఓవర్‌పైకి మళ్లీ వాహనాలను అనుమతి ఇస్తామని ఆయన వెల్లడించారు. మరో పదిరోజుల్లో బయో డైవర్సిటీ ఫ్లై ఓవర్ తెరిచే అవకాశముందని తెలిపారు. బయో డైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై హైస్పీడ్‌తో వాహనాలు నడిపిన 540 వాహనాలకు పెనాల్టీలు విధించామని, ఇకనుంచి కూడా పెనాల్టీలు కొనసాగుతాయని తెలిపారు. బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై నిపుణుల కమిటీ నివేదిక వచ్చిందని, ఫ్లై ఓవర్ డిజైన్‌లో ఎలాంటి లోపం లేదని నిపుణులు తమ నివేదికలో తేల్చారని వివరించారు. హైస్పీడ్ కారణంగానే బయో డైవర్సిటీ ఫ్లై ఓవర్‌పై ఇటీవల ప్రమాదం జరిగిందని నిపుణులు నిర్ధారించారని తెలిపారు. ఈ నేపథ్యంలో అవసరమైతే శని, ఆదివారాల్లో ఈ ఫ్లై ఓవర్‌ను పోలీసులతో చర్చించి మూసివేస్తామని తెలిపారు. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమయాలలో బారీకేడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న అన్ని ఫ్లై ఓవర్లపై డా 40 కిలోమీటర్ల స్పీడ్ లిమిట్ ఉందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో గోయింగ్ వర్స్‌లో వేగం పెంచామని లోకేష్ కుమార్ తెలిపారు. జీహెచ్ఎంసీలోని కొన్ని ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్కై వేస్ అనుమతులు వచ్చాయని తెలిపారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నగర అభివృద్ధి జరుగుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 3వేల పార్కులు ఉన్నాయని తెలిపిన ఆయన.. వాటిలో టాయిలెట్స్ పెట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు. ఫుట్‌పాత్‌ల అభివృద్ధి మార్చి వరకు పూర్తి అవుతాయని తెలిపారు. జీహెచ్ఎంసీలోని 35లింక్ రోడ్స్‌పై డీపీఆర్ రెడీగా ఉందన్నారు. అదేవిధంగా కొన్ని స్థలాలపై కోర్టులో కేసులు ఉన్నాయని చెప్పారు. ఇదే సమయంలో రాష్ట్రపతి పర్యటనపై స్పందించిన కమిషనర్ లోకేష్ కుమార్.. రాష్ట్రపతి పర్యటన కంటోన్మెంట్ చూస్తుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో కొన్ని తాము చూస్తున్నామని చెప్పారు.

మున్సిపల్ పోరుపై రాజకీయ పార్టీల దృష్టి

క్షేత్రస్తాయి పర్యటనలతో నేతల హల్‌చల్
టిక్కెట్ల వేటలో ఆశావహుల ఆతురత

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ) :మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. అన్ని పార్టీలు కీలకంగా భావిస్తున్న పుర పోరుపైనే ప్రధాన పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. మున్సిపాలిటీ ఎన్నికల వార్డుల రిజర్వేషన్లు ఇంకా ప్రకటించలేదు. అయినా కొందరు ఔత్సాహికులు పార్టీ నుంచి తనకే టికెట్ ఖాయమనే తీరును ప్రదర్శిస్తున్నారు. అన్ని పార్టీల్లో ఆశావహుల జోరు కనిపిస్తోంది. అధికార టీఆర్ఎస్‌కు ఈ పోటీ తీవ్రంగా ఉంది. ఒక్కో వార్డు నుంచి ముగ్గురు నుంచి ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. టిక్కెట్‌ను దక్కించుకోవడానికి ఇప్పటికే లాబింగ్‌లు మొదలెట్టారు. ఒకవైపు అధికార యంత్రాంగం ఎన్నికలకు చకచకా ఏర్పాట్లు చేస్తుండగా మరోవైపు గెలుపు లక్ష్యంగా ముఖ్య నాయకులు పావులు కదుపుతున్నారు. ఏళ్లుగా ఎదురు చూస్తున్న నాయకులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగించుకోవడానికి ఉత్సాహం కనబరుస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో టిక్కెట్టు చేజారకుండా ముఖ్యనాయకులపై ఒత్తిడి పెంచుతున్నారు. కొత్తగా టికెట్‌ను ఆశిస్తున్న వారి తాకిడి ఈ పార్టీలో అధికంగానే కనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికలపై అధికార టీఆర్ఎస్ భారీ అంచనాలతో ఉంది. పార్టీ సభ్యత్వ నమోదు 50 లక్షలకు చేరడంతో పాటు, సంస్థాగతంగా బలంగా ఉన్నందున పురపోరులోనూ తమదే విజయం అన్న ధీమాలో ఉన్నారు. పంద శాతం జెడ్పీ పీఠాలను సాధించినట్లే జిల్లాలో ఉన్న మున్సిపాలిటీల్లో సత్తా చాటి.. పదవులను కైవసం చేసుకోవాలని చూస్తోంది. రిజర్వేషన్లు ఎలా ఉన్నా గెలుపు గుర్రాలను పోటీలో నిలుపుతామని ఇప్పటికే వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ప్రకటించారు. వార్డుల్లో అధికారులను వెంటబెట్టుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు కలియ దిరుగుతున్నారు. సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశిస్తున్నారు. బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికలను ఇప్పుడు ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగు స్థానాలు గెలిచాక జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తెలంగాణ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అనేకచోట్ల మెజార్టీ వచ్చింది. దీంట్లో పట్టణంలో అధికంగా ఓట్లు వస్తాయని భావిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో సత్తాచాటాలని చూస్తున్నారు. ఈసారి వార్డుల సంఖ్య పెంచుకొని చైర్మన్ పదవి దక్కించుకోని సంస్థాగతంగా బలోపేతం కావాలనే యోచనలో బీజేపీ నాయకులు ఉన్నారు. అసెంబ్లీలో ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా చతికిలపడింది. గత ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు అందుకోవడం లో విఫలం అయిన ఈ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళుతుందో చూడాల్సి ఉంది. అధిష్ఠానం సూచనల మేరకు మున్సిపాలిటీ ఎన్నికల సన్నద్ధతపై కాంగ్రెస్ తన కార్యాచరణను ప్రకటించనుంది. ఈ ఎన్నికలను చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పార్టీ తరుపున టికెట్ తీసుకుని గెలిచాక నాయకులు అధికార పార్టీలోకి వెళ్లకుండా ఆచూతూచి వ్యవహరిస్తూ నమ్మకస్తులను ఎంపిక చేయడానికి ప్రయత్నిస్తున్నారు. మరోవైపు టీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్, పార్టీలు కూడా ఎక్కువ మున్సిపాలిటీలను కైవసం చేసుకునేలా ముందుకు అడుగులేస్తున్నారు. మున్సిపాలిటీల్లో ప్రధాన పార్టీల తరపున రంగంలో నిలిచేందుకు నాయకగణం ఉవ్విళ్లూరుతున్నారు. గతంలో గెలిచి పాలనతీరులో భాగమైన సిట్టింగుల్లో ఎక్కువ మంది మరోసారి తమకు రిజర్వేషన్ అనుకూలిస్తుందని.. ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేయాలనే పట్టుదలను కనబరుస్తున్నారు. ఆశించిన వార్డుతోపాటు అనుకూలంగా ఉండే ఇతర స్థానాల్లోనూ పోటీకి సై అంటున్నారు. ప్రజలతో ఉన్న సత్సంబంధాలు తమకు కలిసి వస్తాయనే తీరుతో పోటీ దిశగానే దృష్టిని చూపిస్తున్నారు. అనుచరుల వద్ద టికెట్ పొందుతామనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. పనిలో పనిగా కాలనీల్లో, బస్తీల్లోని పెద్దలు సహా కులసంఘాలతో భేటీలు చేపట్టారు. పట్టణ ప్రాంతంలో కీలకమైన కౌన్సిలర్ పోటీ చేయడాన్ని ఆయా పార్టీల నాయకులు సవాలుగా తీసుకుంటున్నారు. ఒకవేళ ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పక్క పార్టీలోకి మారైనా పోటీకి సమాయత్తమవుతున్నారు. ఉన్నపలంగా నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎక్కువగా సమయం ఉండకపోవడం అప్పటికప్పుడు అభ్యర్థుల వెతుకులాట సహా ఇతరత్రాలుగా ఎదురయ్యే ఇక్కట్లను తట్టుకునేందుకు ముందస్తుగానే అభ్యర్థుల విషయంలో ఓ అంచనాలున్నాయి. తమ పార్టీలోని బలమైన నాయకుడికి టికెట్ ఇవ్వడం లేదా అనివార్యమైన చోట పక్కపార్టీలోని మంచి నాయకుడికి గాలం వేసి పార్టీలోకి ఆహ్వానించడం లాంటి ప్రయత్నాల్ని అన్ని పార్టీలు చేపట్టబోతున్నాయి. మరోవైపు నాయకులు కూడా తమ కళ్లముందున్న రాజకీయ వాతావరణానికి అనుగుణంగా వలసలకు తెరతీయ నున్నారు. తమ సొంత పార్టీలో టికెట్ వచ్చేలా ప్రయత్నాలు చేసుకుంటున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అనేక జిల్లాల్లో మున్సిపాలిటీలో ఉన్న కొన్ని వార్డులపై అధికార పార్టీ నేతలు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. చాలా ఏళ్ల నుంచి కౌన్సిలర్లుగా ఉంటూ ప్రభుత్వంపై ప్రశ్నలు గుప్పిస్తున్న కొందరిని వచ్చే కౌన్సిల్‌కు రాకుండా చూడాలని ప్రణాళిక రచిస్తున్నారు. దీనిలో భాగంగా ఆయా వార్డుల్లో ఆకర్ష్ మంత్ర ప్రయోగాన్ని ఉపయోగిస్తున్నారు. మొత్తంగా పురపోరు ఆసక్తికరంగా సాగనుంది.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే

నిజామాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): భవిష్యత్ తరాల కోసమే సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. ఇందులో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. పంచాయితీ ప్రణాళికలో అందరూ పాల్గొనాలన్నారు. మొక్కలు పెంచకుంటే మనకు కనీసం ఆక్సిజన్ కూడా దక్కదని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. పలుచోట్ల హరితహారం కార్యక్రమానికి హాజరై మొక్కలు నాటారు. హరితహారం కార్యక్రమంలో భాగస్వాములైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని పాటించకుంటే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. హరితహారంలో భాగంగా ప్రతీ ఇంట్లో ఐదు మొక్కలు నాటి, సంరక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత సంబంధిత శాఖ అధికారులే తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన మొక్కలను కాపాడే బాధ్యత సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, గ్రామ కార్యదర్శులపై ఉంటుందన్నారు. అలాగే గ్రా మానికి కేటాయించిన టార్గెట్ పూర్తి చేస్తేనే అభివృద్ధి పనులు కూడా అదే స్థాయిలో జరుగుతాయని స్పష్టం చేశారు.

రైతు సమస్యలపై చిత్తిశుద్ధి లేని కేసీఆర్

కరీంనగర్,డిసెంబర్1(నేటినిజం ప్రతినిధి): కేసీఆర్‌కు నచ్చితే నజరానా లేకుంటే జరిమానా అన్న చందంగా వ్యవహరిస్తున్నాడని బిజేపి నేత సుగుణాకర్ రావు విమర్శించారు.

నచ్చిన వారికి ఇష్టానుసారంగా కోట్ల నజరానా ఇస్తున్నారని రైతులకు మాత్రం మొండిచేయిస్తున్నాడని మండిపడ్డారు. పథకాల అమలులో కూడా టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ధ్వజమెత్తారు. ఉద్యమాలు, పోరాటాల ద్వారా ప్రభుత్వం మెడలు వంచి రైతులకు మేలు జరిగే వరకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఉద్యమకారులపై భౌతిక దాడులు పాల్పడుతున్నారని దీనిపై తెలంగాణా సమాజం ఆలోచించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసేంతవరకు రాజీలేని పోరాటం చేస్తామని హెచ్చరించారు. అలాగే కంది,మిర్చి తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. రైతు రుణమాఫీ అంశం రైతులకు గుదిబండగా మారిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు కొంత ఊరట కల్పించాలని కేంద్రం కరువు నిధులకింద విడుదల చేస్తే పెట్టుబడి రాయితీకింద రైతులను ఆదుకోకుండా నిధులను భోంచేసిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు సంక్షేమంపై కాస్తా దృష్టిపెట్టి ఉంటే ఈపరిస్థితిలా ఉండేదికాదన్నారు. లక్షా ముప్పై కోట్ల బడ్జెట్ పెడుతున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం రుణమాఫీ కింద మొత్తాన్ని ఎందుకు పెంచ లేదన్నారు.

పౌరసత్వ బిల్లుతో.. భారత ముస్లింలకు నష్టమేమీలేదు

- కాంగ్రెస్, టీఆర్ఎస్‌లు వక్రభాష్యం చెబుతున్నాయి
- మతోన్మాద మంటల్లో చలికాచుకుంటున్నాయి
- రాష్ట్రంలో సమావేశాలు నిర్వహించి బిల్లుపై అవగాహన కల్పిస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ చట్టంతో భారత ముస్లింలకు ఎలాంటి నష్టం లేదని, ఈ బిల్లుకు భారత ముస్లింలకు ఎలాంటి సంబంధం లేదని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు

బంగారు తెలంగాణ పేరుతో ప్రజా వంచన

ఉమ్మడి పోరాటాలే శరణ్యం: సిపిఐ

హైదరాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): బంగారు తెలంగాణ పేరుతో ప్రజలను మభ్యపెడుతూ కాలక్షేపం చేయడంతో పాటు బడుగు బలహీనవర్గాల వారిపై దాడులు చేస్తున్నారని సిపిఐ రాష్ట్రకార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడి ఐదేళ్లయినా తెలంగాణ బతుకులు బాగు పడలేదని, సమస్యల సాధనకు ఇక ఉమ్మడి పోరాటాలే శరణ్యమని పిలుపునిచ్చారు. విపక్షాలకు సమ్యలే లేవని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అనడాన్ని బట్టి చూస్తే ప్రజల సమస్యలపై వారికి ఏ పాటి చిత్తశుద్ది ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని,వారికి మూడెకరఆల భూ హామీ అమలుకాలేదన్నారు.

దేశంలో మతోన్మాద శక్తుల వల్ల ప్రజాస్వామ్యం, లౌకికవాదా నికి ప్రమాదం ఏర్పడిందని, వీటిని పరిరక్షించడానికి ఉ ద్ధతంగా పోరాటాలు చేయనున్నామని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఇతర మతతత్వ శక్తుల దుష్టపన్నాగాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ంగా పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. భూ కుంభకోణాలు, కల్తీవ్యాపారం, ఇసుక మాఫి యా, డ్రగ్స్ మాఫి యాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని చాడ విమర్శిం చారు. కాషాయీకరణ ముసుగులో ఆర్థిక, భూ, డ్రగ్స్ మాఫియా తయారైందని అన్నారు. బిజెపి పాలనలో ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్య రక్షణకు యువత మేల్కొనా ల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఇటువంటి విధానాలను వ్యతిరేకించాల్సిన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కేంద్రం వద్ద మోకరిల్లుతున్నారని, ఇది రాష్ట్ర ప్రయోజనాలకు భంగకరమైందని చెప్పారు. తెలంగాణ వచ్చిన తరవాత కూడా అభివృద్ధి కోసం పోరాడాల్సి ఉ ంటుందని ఆనాడు జయశంకర్ సార్ చెప్పారని, ఎందుకో అన్నది ఇప్పుడు అర్థం అవుతోందన్నారు. తెలంగాణలో అభివృద్ధికి సంబంధించి ఓ ప్రాతిపదిక లేకుండా పోయిందన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్ అంటూ గొప్పలు చెప్పుకోవడం మినహా కనిపించేదేమీ లేదన్నారు. అభివృద్ధిలో నంబర్ వన్ అయితే ప్రజల సమస్యలు ఎందుకు పరిష్కారం కావని ప్రశ్నించారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రజలకు న్యాయం జరగాలనే లక్ష్యంతోనే పోరాటం చేస్తున్నామన్నారు. ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సొంత రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు ప్రజలకు దక్కుతాయని ఆశిస్తే పరిస్థితి భిన్నంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమగ్ర వ్యవసాయ విధానం లేదని, చిన్న పరిశ్రమలను బతికించే విధానం రాలేదని వాపోయారు. దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామంటూ ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం.. పంపిణీ చేసిన భూమి కంటే గుంజుకున్నదే ఎన్నో రెట్లు ఉ ందని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వెల్‌లోనే ఎన్నో సమస్యలు తిష్ట వేశాయన్నారు.

పరిశ్రమల పునరుద్ధరణ ఏమయ్యింది: సిపిఐ

ఆదిలాబాద్,,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఏర్పడి, టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు నిరుద్యోగ సమస్యకు పరిస్కారం దక్కలేదని సిపిఐ జిల్లా నాయకుడు కలవేన శంకర్ అన్నారు. మూతపడ్డ ఒక్క పరిశ్రమకూడా తెరుచుకోలేదని సిపిఐ విమర్శించింది. టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలకు ఇంతకన్నా నిదర్శనం ఉండబోదన్నారు. అధికారంలోకి వస్తే మూతబడిన పరిశ్రమలను తెర్పించి కార్మికులకు ఉపాధి కల్పిస్తామన్న తెరాస నాయకుల హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధన కోసం సిపిఐ పోరాటం చేస్తోందన్నారు. సీసీఐతోపాటు జిన్నింగ్ మిల్లులు మూతబడినా పట్టించుకోవడం లేదన్నారు. కార్మిక సంక్షేమం అంటే పరిశ్రమలు మూతబడేయడం, పట్టించుకోక పోవడమేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటే వాటిపై ఆధారపడిన కార్మికులు ఎలా బతకాల న్నారు. వారి బాధలు ఈ ప్రభుత్వానికి పట్టావా అని ప్రశ్నించారు. కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమను చూపుతున్నాయని దుయ్యబట్టారు. కార్మిక హక్కులను ఈ పాలకులు కాలరాస్తున్నారని ఆరోపించారు. మూతబడిన పరిశ్రమలను పునరుద్ధరించేలా పోరాటాలు చేసి ప్రభుత్వం మెడలు వంచడానికి కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక రంగాన్ని తెరాస ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు.

రాజధాని గ్రామాల్లో..ఆందోళన ఉధృతం

- బంద్‌లో పాల్గొన్న 29గ్రామాల ప్రజలు
- రోడ్లపైకి వచ్చి పురుగుమందుల డబ్బాలతో నిరసన
- సచివాలయాలనికి వెళ్లే రహదారిపై రాకపోకలు నిలిపివేత
- ప్రభుత్వ ప్రకటన వెనక్కు తీసుకోవాలని డిమాండ్
- మద్దతు తెలిపి ఆందోళనలోపాల్గొన్న దేవినేని ఉమ
- అరెస్టు చేసి స్థానిక స్టేషన్‌కు తరలింపు
- రాజధాని పరిధిలోని గ్రామాల్లో భారీ బందోబస్తు

అమరావతి,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఏపీ రాజధాని అమరావతి గ్రామాల్లో ఆందోళన ఉధృతమైంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన మూడు రాజధానుల ప్రకటనతో అమరావతి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని కోసం తమ విలువైన భూములు పణంగాపెట్టి ప్రభుత్వానికి అప్పగిస్తే ఇప్పుడు తమను వెానం చేశారంటూ మండిపడుతున్నారు. సీఎం జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అమరావతి గ్రామాల్లో రైతులు గురువారం రోడ్డెక్కారు. రాజధాని పరిధి గ్రామాల ప్రజలు బంద్‌కు పిలుపునిచ్చి.. ఎక్కడికక్కడ వాహనాల రాకపోకలను అడ్డుకుంటున్నారు. తుళ్లూరు, మందడం వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. సచివాలయానికి వెళ్లే రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. పలుచోట్ల రహదారులపై రైతులు తమ వాహనాలను అడ్డుపెట్టారు. పాఠశాలలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా దుకాణాలను మూసేశారు. ప్రభుత్వం తమ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాజధానిని పరిరక్షించాలంటూ నినాదాలు చేస్తున్నారు. మరోవైపు ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో సెక్షన్ 144, 34 పోలీసు చట్టం అమల్లో ఉందని తుళ్లూరు డీఎస్పీ తెలిపారు. రైతులు తమ ఆందోళనలు శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిరసన కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని చెప్పారు. రాజధాని పరిధిలోని గ్రామాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 30 మంది ఎస్సైలు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా వెలగపూడిలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. గ్రామానికి ఇద్దరు చొప్పున నిరసన దీక్ష చేపడుతున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజధాని తమకు ఇక్కడే ఉ ంచాలని డిమాండ్ చేశారు. మూడు రాజధానులు అవసరం లేదని, తాము కోరుకుంటున్నది ఒక్కటేనన్నారు. సీఎం జగన్ విలువ నిలబెట్టుకోవాలని సూచించారు. సీఎం జగన్ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా తుళ్లూరులో రైతుల రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా బాధలు అర్థం చేసుకున్న నాయకుడొచ్చాడని నమ్మామని, నీకు పాలాభిషేకం చేస్తే మా నోట్లో మట్టి కొడతావా సీఎం జగన్ బాబూ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల ఓట్లతో సీఎం అయి ఇప్పుడు వారిని ఆవేదనకు గురిచేయటం సరైందికాదంటూ పలువురు మహిళల ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ది కోసం ప్రజల్ని అంధకారంలోకి నెట్టటం సరైందికాదని వాపోయారు. భూములిస్తే మా పిల్లలకు ఉద్యోగాలిస్తామన్నారని, ఇప్పుడు ఉద్యోగాలు లేవు, ఇంట్లో మగవారికి పనులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ చేసిన మూడు రాజధానుల ప్రకటతో ఇలా నడిరోడ్డుమీద కూర్చోవాల్సి వచ్చిందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. తమను నడిరోడ్డుపైకి లాగి..మూడు రాజధానులంటే ప్రకటించేసి తమ ఎమ్మెల్యేలతోను, మంత్రులతోను సీఎం జగన్ ఏసీ రూముల్లో పార్టీలు చేసుకుంటున్నారనీ, ప్రజల్ని వేదనకు గురిచేసిన ఏప్రభుత్వం నిలవదని అమరావతి ప్రాంత మహిళలు సీఎంను హెచ్చరిస్తున్నారు. అన్ని పార్టీలకు సంబంధించిన కుటుంబాల వారు రాజధాని అమరావతికి భూములు ఇచ్చామని ఇప్పుడు సీఎం జగన్ హఠాత్తుగా ఇటువంటి నిర్ణయం తీసుకోవటంతో ఆ భూముల్ని కట్నాలుగా ఇచ్చిన తమ ఆడబిడ్డల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని ఇటువంటి అనాలోచిన నిర్ణయాలతో ప్రజల జీవితాలే కాక, రాష్ట్ర అభివృద్ధికి ప్రమాదకరంగా మారుతుందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి దేవినేని ఉమ అరెస్ట్..

రాజధాని తరలింపునకు నిరసనగా విజయవాడ గొల్లపూడి సెంటర్‌లో జాతీయ రహదారిపై మాజీ మంత్రి దేవినేని ఉమ బైటాయించారు. దీంతో రోడ్డుకు ఇరు వైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాజధాని గ్రామస్తులు సైతం ఈ ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు దేవినేని ఉమను అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను విజయవాడలోని భవానీపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులను అడ్డుకునేందుకు టీడీపీ కార్యకర్తలు యత్నించారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. పరిస్థితి చేయిదాటుతుండటంతో పోలీసులు బలవంతంగా దేవినేని ఉమను పోలీసులకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

మున్సిపల్స్‌లోనూ సత్తా చాటుతాం: పల్లె

నిజామాబాద్,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని జిల్లా బిజెపి అధ్యక్షులు పల్లె గంగారెడ్డి తెలిపారు.దేశంలో ప్రాంతీయ పార్టీలన్నీ కుటుంబ పార్టీలేనని, తెలంగాణలో కూడా కుటుంబ పార్టీ పాలన చేస్తోం దని అన్నారు. ఆ పార్టీలు పలు రాష్ట్రాల్లో కుప్పకూలుతునా న్నయని పేర్కొన్నారు. ప్రాంతీయ, కుల, మత, కుటుంబ పార్టీలకు కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పథకాలను అమలు చేయకుండా అడ్డుకుంటుందని, అందులో పీఎం ఆవాస్ యోజన, ఫసల్ బీమా యోజన, ఆయూష్మాన్ భారత్ ఉన్నాయని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ పని అయిపోయిందని, పార్లమెంట్‌లో ఆ పార్టీకి 17 రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యమే లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు సారథ్యం వహించే వారే లేరని, పార్టీ అధ్యక్షుడే అస్త్ర సన్యాసం చేశారని ఎద్దేవా చేశారు. బీజేపీ అత్యధిక రాష్ట్రాల్లో అధికారంలో ఉ ందని, బీజేపీకి కేంద్రంలో రెండోసారి సంపూర్ణ మెజార్టీని ప్రజలు ఇచ్చారన్నారు. 14 కోట్ల కుటుంబాలకు కేంద్ర పథకాలు నేరుగా చేరుతున్నాయని, పైరవీకారులు, కమీషన్ ఏజెంట్లు ఈ ప్రభుత్వంలో లేరని చెప్పారు. సమస్యలపై టిఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయిందన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీకి ఇలాంటి గతి పట్టడం దురదృష్టకరమని అన్నారు. షుగర్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడమే పెద్ద తప్పు అని వ్యాఖ్యానించారు. తెలుగు దేశం తర్వాత కాంగ్రెస్ పార్టీ కూడా షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ అత్యంత తెలివైన అవినీతిపరుడని విమర్శించారు. దేశంలోనే అత్యంత అవినీతిపర ముఖ్యమంత్రుల్లో కేసీఆర్ నెంబర్ వన్ స్థానంలో ఉ న్నారని దుయ్యబట్టారు. లాభాల్లో ఉన్న ఫ్యాక్టరీ నుంచి టీడీపీ, కాంగ్రెస్ నాయకులు సంపాదిస్తే టీఆర్ఎస్ మాత్రం నష్టాల్లో ఉన్న ఫ్యాక్టరీని కూడా వదల్లేదని మండిపడ్డారు. సమస్య చెబుదామనుకుంటే దొర కిందకి దిగడు, సమస్య వినడు..యాజమాన్యం లెక్కలు అడిగితే అన్ని నోటి లెక్కలు చెప్పి తప్పుదోవ పట్టించారని దెప్పిపొడిచారు. త్వరలోనే పసుపు బోర్డు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకు ఎంపి ధర్మపురి అర్వింద్ కృషి చేస్తున్నారని అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం

కరీంనగర్,డిసెంబర్19(నేటినిజం ప్రతినిధి) ప్రైవేట్ ఆసుపత్రులకంటే కూడా మెరుగైన వైద్యాన్ని ప్రభుత్వాసుపత్రుల్లో అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడమే గాకుండా అందుకు అనుగుణంగా నిధులు కేటాయిస్తూ వస్తున్నారని టిఆర్ఎస్ అధ్యక్షుడు ఈద శంకర్ రెడ్డి అన్నారు. గత దశాబ్దకాలంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు వైద్యసేవలు సరిగా అందడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలపై వైద్యఖర్చుల భారం పడకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రభుత్వా సుపత్రల్లో ప్రసూతి సంఖ్యను పెంచేందుకు అనేక రాయితీలు ఇస్తున్నారని అన్నారు. కెసిఆర్ కిట్ పథకంతో పేదలకు నజరానా అందుతోందన్నారు. ఇందుకోసం కావాల్సిన అన్ని చర్యలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసం కల్పిస్తామన్నారు. ఇకనుంచి జిల్లాలోని ఏ ఆసుపత్రిలోను పరికరాలు, యంత్రాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ వైద్య సేవలు అందించుటలో కరీంనగర్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దుటకు శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు.

టీడీపీ లేకుండా చేయాలని

వైసీపీ కుట్రలు చేస్తుంది

- తాము మీలా చేసుంటే వైసీపీ ఉండేదేకాదు
- ప్రమోషన్ల కోసం పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారు
- తెదేపా మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం
- వైకాపా బాధితులకు వడ్డీతో సహా నష్టపరిహారం కట్టించే పూచీ నాది
- తప్పు చేసిన వారిని వదిలిపెట్టను
- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

అనంతపురం, డిసెంబర్19(ఆర్ఎన్ఎ) : టీడీపీ లేకుండా చేయాలని వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారని, టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ హింసిస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మా ప్రభుత్వం హయాంలో ఇలానే చేసుంటే వైసీపీ అనేది ఉండేదే కాదని అన్నారు. తెదేపా నేతలు, కార్యకర్తలతో గురువారం అనంతపురంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అట్రాసిటీ కేసులు నమోదు చేసి తెదేపా నేతలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆత్మకూరులో 130 మందిని ఊరి నుంచి తరిమేశారని చెప్పారు.

తెదేపా కార్యకర్తలను పోలీసులు దారుణంగా వేధిస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో తెదేపాకు చెందిన 40 మందిపై కేసులు పెట్టారని చెప్పారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని, సీఐ భక్తవత్సలరెడ్డిపై ప్రైవేటు కేసు వేశామని, పోలీసు దుస్తులు వేసుకున్నందుకు ప్రజలకు న్యాయం చేయాలన్నారు. చట్టాలు రక్షించేందుకే పోలీసులున్నారని అన్నారు. చట్టాన్ని అతిక్రమించిన పోలీసులకు జైలు శిక్షలు తప్పవని చంద్రబాబు హెచ్చరించారు. పదవీ విరమణ చేసినవారినీ వదిలిపెట్టమని చంద్రబాబు హెచ్చరించారు. అధికారులు ప్రభుత్వాన్ని కాకుండా చట్టాన్ని గౌరవించాలని చంద్రబాబు కోరారు. వైకాపా బాధితుల కోసం పునరావాస కేంద్రం పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని, వారిని పరామర్శించేందుకు చలో ఆత్మకూరు పిలుపునిచ్చామని ఆయన అన్నారు. ఆత్మకూరు వెళ్లకుండా మా ఇంటిగేటుకు తాళ్లు కట్టారని, నన్నే అడ్డుకున్నారంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంమిటని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు పులిలా ఉండే కోడెలను ఎన్నోరకాలు వేధించి, చివరకు ఆత్మహత్యకు కారణమయ్యారని చంద్రబాబు అన్నారు. తెదేపా మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, వైకాపా బాధితులకు వడ్డీతో సహా నష్టపరిహారం కట్టించే పూచీ నాదని చంద్రబాబు భరోసా ఇచ్చారు. దమ్ముంటే ప్రత్యక్షంగా రండి.. ఎక్కడైనా ఎదుర్కొంటామని సవాల్ విసిరారు. వైకాపా నేతలు పోలీసులను చూపించి భయపెడదామని చూస్తున్నారని ఆరోపించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా.. సంయమనం పాటిస్తున్నామని, తప్పు చేసిన వారిని భవిష్యత్తులో వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కొందరు నేతలు ప్రభుత్వానికి లొంగిపోయి ఇప్పుడు పార్టీనే తిడుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. అలాంటివారికి ప్రజలే గుణపాఠం చెబుతారని చంద్రబాబు అన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం: వీరెల్లి

నల్లగొండ,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): పేదల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందని, కేంద్ర పథకాలను టీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో బీజేపీ పోటీ చేస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద కేంద్రం ఒక్కో ఇంటికి రూ.1.60 లక్షలు ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని వారి జాబితా ఇవ్వమంటే కేంద్రం అడిగినా ఇవ్వలేదన్నారు. వర్షాలు పడక కరువు తీవ్రంగా ఉ ందని, ఫసల్ బీమా యోజనకు కేంద్రం 85 శాతం చెల్లిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఏపీతో పాటు తెలంగాణలో కూడా కాంగ్రెస్ కనుమరుగైందని, ఇక రాష్ట్రంలో ఉండేది బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలే అని అన్నారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీలోకి చేరడానికి ఆసక్తిగా ఉన్నారని అన్నారు. అందరూ చేరి మోదీ నాయకత్వానికి అండగా ఉండాలన్నారు. కేంద్రం డిజిటల్ ఇండియా చేసేందుకు నిధులు ఇచ్చినా గ్రామ పంచాయతీలకు హై స్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంలో కేటీఆర్ విఫలమైనట్లు తెలిపారు.నల్లగొండ మున్సిపాలిటీకి 14 ఆర్థిక సంఘం ద్వారా, అమృత్ కింద కేంద్రం రూ. 250 కోట్లు ఇచ్చిందని తెలిపారు.

అంటువ్యాధులపై అప్రమత్తం

అప్రమత్తం చేసిన అధికారులు

భద్రాద్రికొత్తగూడెం,డిసెంబర్19 (ఆర్ ఎన్ఎ): సీజనల్ వ్యాధులపట్ల క్షేత్రస్తాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ అధికారులు సూచించారు. చలి పెరుగుతున్నందున స్వైన్‌ఫ్లూ లాంటి రోగాలు విజృంభించే ప్రమాదం ఉందన్నారు. అవసరాన్ని బట్టి గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రోగులకు తక్షణ వైద్యం సాయం అందించేలా ప్రణాళిక రూపొందించు కోవాలన్నారు. ప్రబుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఎక్కడా ఎలాంటి వ్యాధులు రాకుండా చూసే బాధ్యత డాక్టర్లపై ఉందని అన్నారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. చలికాం సీజన్ వచ్చిందంటే చాలు వైద్యులు ముందస్తుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. చాలా చోట్ల ఫిర్యాదులు వస్తున్నాయని, అవిరానివ్వకుండా చూడాలన్నారు. ప్రైవేటుకు ధీటుగా సర్కారు ఆసుపత్రులు ఉండాలన్నారు. ఆసుపత్రుల ఆవరణలు పరిశుభ్రంగా ఉండాలన్నారు.

చలి పంజా!- ఉత్తరాదిని వణికిస్తున్న చలి

- నోయిడా సహా ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో స్కూళ్లకు సెలవులు
- 12.2 డిగ్రీలకు పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు
- జమ్ము, కశ్మీర్‌లో మంచు వర్షం

న్యూఢిల్లీ,డిసెంబర్19(ఆర్ఎన్ఎ): ఉత్తర భారతంపై మరోసారి చలిపులి పంజా విసురుతోంది. ప్రధానంగా దేశరాజధాని ఢిల్లీలో చలితీవ్రత పెరిగింది. జనాలు బయటకు రావాలంటేనే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. చలి కారణంగా నొయిడా సహా ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో స్కూళ్లకు సోమవరాం వరకు సెలవులు ప్రకటించారు. వాతావరణం మరింత చల్లగా మారడంతో 19, 20 తేదీల్లోనూ గౌతమ్ బుద్ధనగర్‌లోని పలు స్కూళ్లు మూసి ఉంచనున్నట్టు అధికారులు తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి స్కూళ్లకు చలికారణంగా సెలవు ప్రకటించినట్టు గజియాబాద్ డీఎం చెప్పారు. వరుసగా రెండోరోజు చల్లగాలులు వీస్తుండడంతో ఉత్తరభారతంలో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయానని వాతావరణ శాఖ తెలిపింది. డిసెంబర్ నెలలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోవడం గత 22 సంవత్సరాల్లో ఢిల్లీలో ఇప్పుడు మళ్లీ జరిగిందని అక్కడి వాసులు పేర్కొంటున్నారు. మధ్యాహ్నం సమయంలో టెంపరేచర్ 12.2 డిగ్రీలకు పడిపోయిందని, బుధ, గురువారం ఉష్ణోగ్రతలు మరింత పడిపోయాయని అధికారులు పేర్కొన్నారు. గ్రేటర్ నొయిడా, గజియాబాద్ ఏరియాల్లో పది డిగ్రీల ఉ ష్ణోగ్రత నమోదైంది. పశ్చిమ యూపీలో పలు ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేస్తోంది. అంతేకాదు, ప్రయాగ్‌రాజ్‌తో సహా పలు ప్రాంతాల్లో విపరీతమైన చలి ఇబ్బందిపెడుతోంది. ఉత్తరాది రాష్ట్రం అయిన ఉత్తరాఖండ్‌లో సాధారణ జనజీవనం చలితో తీవ్రంగా ప్రభావిత మవుతోంది. రోడ్స్, రైల్వేస్, ఎయిర్‌వేస్ పై కూడా చలి మంచు ఎఫెక్ట్ కనిపిస్తోంది. అధిక మంచు కారణంగా డెహ్రాడూన్ నుంచి పలు ఫ్లయిట్స్ రద్దుకాగా మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. జమ్ము, కశ్మీర్‌లో మంచు వర్షం కొనసాగుతోంది. కనిష్ఠ ఉ ష్ణోగ్రతలు పడిపోవడంతో గడ్డగట్టే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. శ్రీనగర్‌లో రాత్రి ఉష్ణోగ్రత 3.7 డిగ్రీలుగా, పగటి ఉష్ణోగ్రత 5.8 డిగ్రీలుగా నమోదైంది. జమ్మురీజియన్‌లో గత శుక్రవారం నుంచి మంచు కురుస్తూనే ఉండడంతో.. రోడ్లకు, విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. రెండు మూడు రోజుల నుంచి దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉ ంది. రాజస్థాన్‌లోని సికార్ ప్రాంతం 3.5 డిగ్రీల ఉష్ణోగ్రతతో రాష్ట్రంలోనే అతిచల్లని ప్రాంతంగా నిలిచింది. మరో 24గంటలు పరిస్థితి ఇలాగే ఉంటుందని వాతావరణశాఖ చెబుతోంది. పంజాబ్, హర్యానా, చండీగఢ్‌లలోనూ రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చాలా ప్రాంతాల్లో పొగమంచు కారణంగా చీకట్లు కమ్ముకున్నాయి.

అలేరు ఎమ్మెల్యే సునీతకు తప్పిన ప్రమాదం

- ఊడిపడిన కార్యాలయం పెచ్చులు
- ఎమ్మెల్యేతో సహా మరో ఇద్దరు సర్పంచ్‌లకు గాయాలు

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 19(ఆర్ఎన్ఎ) : ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతకు ప్రమాదం తప్పింది. బిల్డింగ్ స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఆమెకు స్వల్పగాయాల య్యాయి. ఆమె చేతికి గాయమైంది. ఆలేరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. మరో ఇద్దరు సర్పంచ్‌లకు గాయాలు కావడంతో వారికి కూడా వైద్యులు చికిత్స అందించారు. గురువారం ఆలేరులోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌజ్‌లో సర్పంచ్‌లతో ఎమ్మెల్యే సునీత సమావేశం నిర్వహిస్తున్నారు. ఒక్కసారిగా బిల్డింగ్ పెచ్చులు ఊడి కిందపడిపోయాయి. ఎమ్మెల్యేతో పాటు ఇద్దరు సర్పంచ్‌లకు గాయాలయ్యాయి. పెను ప్రమాదం తప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. గతంలో కూడా ప్రమాదం నుంచి తప్పించుకున్నారు గొంగిడి సునీత. ఆమె ప్రయాణిస్తున్న కారు..మరో కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు మీదుగా నాగోల్‌కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఓ వాహనాన్ని తప్పించబోయి..ఎదురుగా వస్తున్న మరో వెహికల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సునీత కారు ముదు భాగం దెబ్బతింది. ప్రస్తుతం జరిగిన ప్రమాదంలో ఆమె స్పందించారు. తాను క్షేమంగానే ఉ న్నట్లు గొంగిడి సునీత వెల్లడించారు.

రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ

అన్ని పార్టీల్లోనూ పెరుగుతున్న పోటీ

మున్సిపల్ ఎన్నికల కోసం నేతల చూపు

మహబూబాబాద్,డిసెంబర్19 (నేటినిజం ప్రతినిధి): అన్ని పార్టీల చూపు ఇప్పుడు రిజర్వేషన్ల వైపు మళ్లింది. రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో నాలుగు మున్